మంగళవారం
08-08-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 48
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

నుహ్‌లో 'బుల్డోజ్'కు బ్రేక్

మతపరమైన అల్లరు జరిగిన హరియాణాలోని నుహ్ పట్టణంలో (బుల్డోడ్) కూల్చివేత కార్యక్రమాన్ని పంజాబ్, హరియాణా హైకోర్టు సోమవారం నిలిపివేసింది. ఇక్కడ అధికారులు గత వారం మత ఘర్షణల తరువాత 'అక్రమంగా నిర్మించిన' భవనాలను కూల్చివేసే కార్యక్రమాన్ని చేపట్టారు.

8 లో

సభకు రాహుల్

▸ ఎంపీ సభ్యత్వం పునరుద్ధరణ ▸ అవిశ్వాస తీర్మానంపై చర్చకు ముందు...

న్యూఢిల్లీ: అనర్హత వేటు పడిన నాలుగు నెలల తర్వాత కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ సోమవారం లోక్‌సభకు తిరిగి వచ్చారు. పరువు నష్టం కేసులో దోషిగా తేల్చుతూ క్రింది కోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీం కోర్టు స్టే విధించిన నేపథ్యంలో ఆయన లోక్‌సభ సభ్యత్వాన్ని పునరుద్ధరించారు. మంగళ వారం లోక్‌సభలో మోదీ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో ఆయన ఎంపీగా తిరిగి రావడం ప్రతిపక్ష శ్రేణులకు ఊతమిచ్చింది. విపక్ష కూటమి 'ఇండియా' ముఖ్య వక్తలలో గాంధీ ఒకరిగా ఉండబోతున్నారు. ఎన్‌డీఏ కూటమికి తగినంత మంది ఎంపీల బలం ఉన్నప్పటికీ విపక్ష కూటమి అశ్వాస తీర్మానం ద్వారా ప్రజలకు సందేశాన్ని పంపడానికి చూస్తుంది. సుప్రీం కోర్టు ఉత్తర్వు నేపథ్యంలో తదుపరి న్యాయపరమైన తీర్పులకు లోబడి అనర్హత నిలిపివేసినట్లు రాహుల్ గాంధీని ఎంపీగా తిరిగి నియమిస్తున్నట్లు శుక్రవారం లోక్‌సభ నోటిఫికేషన్‌లో పేర్కొంది. లోక్‌సభ సెక్రటేరియట్ సందేశం అందుకున్న తర్వాత, రాహుల్ గాంధీ పార్లమెంటుకు చేరుకున్నారు. సభలోకి ప్రవేశించే ముందు మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అయితే నిమిషాల వ్యవధిలోనే సభ వాయిదా పడింది. పార్లమెంటు ఆవరణలో గాంధీ తన తల్లి, లోక్‌సభ ఎంపీ సోనియా గాంధీతో కూడా గడిపారు. పార్లమెం టుకు చేరుకున్న గాంధీకి కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష ఎంపీలు ఘనస్వాగతం పలికారు. ప్రధాన ద్వారం వద్ద స్వీట్లు పంచి, కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడికి అనుకూలంగా నినాదాలు చేయడంతో ఉత్సాహం వాతావరణం కనిపించింది. కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు రాహుల్ గాంధీ ఎంపీ

- మిగతా 2 లో

రైతు రుణభారంలో
ఏపీ రెండోస్థానం

కేంద్ర ప్రభుత్వం వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో అంతకంతకూ రైతు రుణ భారం పెరుగుతోందని, దేశంలో రైతుల రుణభారం విషయంలో ఏపీ రెండో స్థానంలో ఉందని కేంద్ర ప్రభుత్వం సోమవారం లోక్‌సభకు తెలిపింది. రైతు భరోసాతో అన్నదాతను ఆనందంలో ముంచెత్తుతు న్నామని, రైతు భరోసా కేంద్రాలు విత్తనం నుంచి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయం వరకు రైతుకు అండగా నిలుస్తున్నామని, దేశం యావత్తూ ఈ పథకానికి ఆకర్షితులవుతున్నట్లు జగన్ ప్రభుత్వం చేస్తున్న ప్రచారమంతా డొల్ల అని కేంద్రం ప్రకటనతో స్పష్టమవుతోంది. లోక్‌సభలో సభ్యులు

- మిగతా 2 లో

వైద్యవిద్య పేదలకు దూరం

▸ డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్య వర్సిటీ ముట్టడి
▸ ఉద్రిక్తత- ఏఐఎస్ఎఫ్ నేతల అరెస్టు
▸ 107, 108 జీవోలు రద్దు చేయాలి: జాన్సన్‌బాబు, శివారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: పేద విద్యార్థులను వైద్యవిద్యకు దూరం చేసే 107, 108 జీవోలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర సమితి అధ్వర్యంలో విజయవాడలో డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయాన్ని సోమవారం విద్యార్థులు ముట్టడించారు. విద్యార్థుల నినాదాలతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తక్షణమే జీవోలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వర్సిటీ వద్ద విద్యార్థి నాయకులు-కార్యకర్తలు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. పోలీసులు మరింత రెచ్చిపోయి నాయకులు, కార్యకర్తలను తోసేశారు. ఈడ్చుకుంటూ వెళ్లి వ్యానుల్లో పడేశారు. అందరినీ అదుపులోకి తీసుకొని...గుణదల పోలీసు స్టేషన్‌కు తరలించారు. దీనికిముందు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాన్సన్‌బాబు, శివారెడ్డి మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం నూతనంగా ప్రారంభిస్తున్న ఐదు ప్రభుత్వ వైద్య

- మిగతా 2 లో

రూ.10 వేల సాగు సాయం ఇవ్వాల్సిందే

విజయవాడ ధర్నాలో రావుల వెంకయ్య డిమాండ్

విశాలాంధ్ర -విజయవాడ(గాంధీనగర్): తెలంగాణ ప్రభుత్వం మాదిరిగా మన రాష్ట్రంలోనూ సాగు చేస్తున్న ప్రతి ఎకరానికి రూ.10 వేల సాయం అందించాలని, రెండెకరాల లోపు సాగుచేస్తున్న రైతు, కౌలురైతులకు రూ.20 వేలు సాయం ఇవ్వాలని అఖిల భారత కిసాన్ సభ జాతీయ అధ్యక్షుడు రావుల వెంకయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సాగు సాయం అందించడమంటే వ్యవసాయాన్ని ప్రోత్సహించడమే నని హితవు పలికారు. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం అధ్వర్యంలో విజయవాడ ధర్నాచౌక వద్ద సోమవారం జరిగిన ధర్నాకు రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ అధ్యక్షత వహించారు. రావుల వెంకయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల కారణంగా ఏపీలో ప్రతి రైతుపై రూ.2.45 లక్షల రుణభారం పడిందన్నారు. ఆత్మహత్యల్లో మన రాష్ట్రం మూడో స్థానంలో ఉందని, అందులో అత్యధికలు పేద, కౌలు రైతులేనని చెప్పారు. పంటల మద్దతు ధరలు అశాస్త్రీయంగా ఉన్నాయని, కనీస మద్దతు ధరకు కూడా రైతులు తమ ఉత్పత్తులు అమ్ముకోలేకపోతు న్నారని వివరించారు. డాక్టర్ స్వామినాథన్ సిఫార్సులను ప్రభుత్వం అటకెక్కించిందన్నారు. రైతుసంఘాలు కోరుతున్నట్లు మద్దతు ధరల కోసం

గ్యారెంటీ చట్టం తీసుకురాడానికి పాలకులు సిద్ధంగా లేరని, మోదీ సర్కార్‌జీ కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తోందని రావుల వెంకయ్య తూర్పారబట్టారు. 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు వాగ్దానం ఏమైందని ప్రశ్నించారు. దేశానికి ఆహారం అందిస్తున్న రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత నుండి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తప్పించు కుంటున్నాయని ఆరోపించారు. రైతు, కౌలురైతులకు రెండు లక్షల రూపాయల వరకు రుణ మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కేరళ తరహా రుణ ఉపశమన చట్టం తీసుకురావాలన్నారు.

రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ పంట విపత్తుల నష్టపరిహారం, బీమా పరిహారం సక్రమంగా రైతుకు అందడం లేదని, అందువల్ల రుణ భారంతో కుంగిపోతూ వ్యవసాయానికి దూరమవుతున్నారన్నారు. రైతు, కౌలురైతులు వ్యవసాయం చేయలేని దుస్థితి ఏర్పడిందని, ఈ దశలో రైతులను ఆదుకునేందుకు సమగ్ర విధానాలు రూపొందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. వ్యవసాయ విద్యుత్ మోటార్లకు పెట్టిన మీటర్లను వెంటనే తొలగించా లని డిమాండ్ చేశారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం రైతాంగ వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నదని ఆరోపించారు. రైతులకు నష్టం చేసేలా మూడు వ్యవసాయ నల్ల చట్టాలను

- మిగతా 2 లో

మణిపూర్‌పై కమిటీ

ముగ్గురు మహిళా మాజీ జడ్జిలతో ఏర్పాటు

▸ బాధితుల పునరావాసం, ఉపశమనం కోసం చర్యలు
▸ పరిహారం, గృహాలు, ప్రార్థనా స్థలాల పునరుద్ధరణ అంశాలు పరిశీలిస్తుంది
▸ 11 ఎఫ్ఐఆర్‌లు సీబీఐకి బదిలీ: సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ : మణిపూర్ జాతి హింస బాధితులకు ఉపశమనం, పునరావాసం కోసం ముగ్గురు మహిళా హైకోర్టు మాజీ న్యాయమూర్తులతో ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు సుప్రీం కోర్టు సోమవారం ప్రకటించింది. జమ్ముకశ్మీర్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి గీతా మిట్టల్ నేతృత్వంలోని ఈ కమిటీలో న్యాయమూర్తులు (రిటైర్డ్) బాంబే హైకోర్టు మాజీ న్యాయమూర్తి

- మిగతా 2 లో

నేడు అవిశ్వాస తీర్మానంపై చర్చ

▸ రాహుల్‌తోనే మొదలు...?
▸ ప్రభుత్వ వైఫల్యాలు ఎండగట్టేందుకు విపక్షాలు సిద్ధం

న్యూఢిల్లీ : గత మూడు నెలలుగా జాతి హింసతో అట్టుడికిపోతున్న మణిపూర్‌పై పార్లమెంటులో చర్చ జరపాలని పట్టుబట్టిన ప్రతిపక్ష పార్టీలు చివరకు ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టాయి. దీంతో ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై లోక్‌సభలో మంగళవారం చర్చ ప్రారంభం కానుంది. దీనికి ఒక్కరోజు ముందే రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వం పునరుద్ధరించడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం పెరిగింది. ఈ చర్చలో రాహుల్ గాంధీ కూడా పాల్గొనున్నారు. అవిశ్వాస తీర్మానంపై సభలో ఆయన కాంగ్రెస్ తరపున చర్చను ప్రారంభించే అవకాశం ఉంది. ఆగస్టు 8 నుంచి 10 వరకు లోక్‌సభలో అవిశ్వాస తీర్మానంపై చర్చ జరగనుంది. మరోవైపు ఇతర విపక్ష పార్టీలు కూడా కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు సిద్ధం అవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వంపై అసోంకు చెందిన కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ అవిశ్వాస తీర్మానం నోటీసు ఇచ్చారు. దీనిని పరిశీలించిన స్పీకర్... ఆగస్టు 8 నుంచి మూడు రోజుల పాటు చర్చ చేపట్టేందుకు సమయాన్ని నిర్ణయించారు. దీనిపై 10వ తేదీన ప్రధాని మోదీ సమాధానమిస్తారు.

ఇదీ లోకం!

రైల్వేస్టేషన్లు సరే, పట్టాలు తప్పని వ్యవస్థని ఎప్పుడు అభివృద్ధి చేస్తారంట?

ఉద్యమ వీరుడికి అశ్రునివాళి

▸ ముగిసిన గద్దర్ అంత్యక్రియలు
▸ అంతిమ యాత్రకు తరలివచ్చిన అశేష జనవాహిని

విశాలాంధ్ర -హైదరాబాద్: అభిమానుల అశ్రు నయనాల నడుమ ప్రజా గాయకుడు గద్దర్ (76) అంత్యక్రియలు సోమవారం సాయంత్రం ముగిశాయి. ఆయన కోరిక మేరకు అల్వాల్‌లోని మహాబోధి విద్యాలయ ఆవరణలో ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో... బౌద్ధ సంప్ర దాయం ప్రకారం అంతిమ సంస్కారాలను పూర్తి చేశారు. అంతకుముందు కడసారిగా గద్దర్‌ను చూసేందుకు ఎల్బీ స్టేడియానికి సినీ, రాజకీయ ప్రముఖులు, కళాకారులు, అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఉద్యమ వీరుడికి విప్లవ జోహార్లు సమర్పించారు. ఆ తర్వాత మధ్యాహ్నం 12 గంటలకు

- మిగతా 2 లో

11న చంద్రుడిపైకి ల్యాండర్

ప్రయోగానికి సిద్ధమైన రష్యా

మాస్కో: చంద్రుడిపైకి ల్యాండర్‌ను పంపించేందుకు రష్యా సిద్ధమైంది. ఆగస్టు 11న రష్యా అంతరిక్ష పరిశోధన సంస్థ రోస్‌కాస్మోస్ ఈ ప్రయోగం చేపట్టనున్నట్లు తెలిసింది. సుమారు 50 ఏళ్ల తర్వాత మరోసారి చంద్రుడిపైకి రష్యా ల్యాండర్‌ను పంపనుంది. మాస్కోకు 3450 మైళ్ల దూరంలోని వోస్తోక్నీ కాస్మోడ్రోమ్ ప్రాంతంలో ఈ ప్రయోగం జరగనుంది. సాయుజ్-2 ఫ్రిగట్ బూస్టర్‌ను మోసుకుని లూనా-25 నింగిలోకి దూసుకెళ్లనుంది. అయితే, ఈ ప్రయోగంలో రాకెట్ బూస్టర్లు... ల్యాండర్ నుంచి విడిపోయిన తర్వాత భూమిపైనే పడనున్నాయి. ఇవి ఉమల్టా, ఉస్మామఖ్, లేపికన్, తస్తాఖ్, సగ్నార్ నదులు, బురేయా నదిలోని ఫెర్రీ క్రాసింగ్ ప్రాంతాల్లో పడే అవకాశాలున్నట్లు రోస్‌కాస్మోస్ భావిస్తోంది. దీంతో ముందు జాగ్రత్తగా ప్రయోగం జరిగే ప్రదేశానికి ఆగ్నేయదిక్కునున్న షక్తిన్‌స్కీ గ్రామంలోని ప్రజలను ఖాళీ చేయిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. 1976 తర్వాత రష్యా చేపడుతున్న తొలి లూనార్ ల్యాండర్ ప్రయోగం ఇది. తొలిసారి చంద్రుడిపై దక్షిణ ధ్రువంలో దీన్ని ల్యాండ్ చేసేలా రూపొందించారు. చంద్రుడిపై సాఫ్ట్ ల్యాండింగ్ టెక్నాలజీస్ అభివృద్ధి, ఉపరితలంపై పరిశోధనలు, అక్కడి వనరుల జాడను గుర్తించేందుకు ఈ ప్రయోగం చేపడుతున్నట్లు రోస్‌కాస్మోస్ పేర్కొంది. లూనా-25 కేవలం ల్యాండర్ మిషన్ మాత్రమే. కేవలం 30 కేజీల పేలోడ్‌ను మోసుకెళ్తోంది. ఇందులో చంద్రుడిపై మట్టి ఆనవాళ్లను సేకరించేందుకు అవసరమయ్యే రోబోటిక్ చేతులు, డ్రిల్లింగ్ హార్డ్‌వేర్‌తో పాటు ఇతర శాస్త్రీయ పరికరాలను దీంతోపాటు పంపించనున్నారు. ఇది సురక్షితంగా చంద్రుడి ఉపరితలంపై దిగినట్లయితే ఓ సంవత్సరం పాటు అక్కడ పనిచేయనుంది.

ఉక్రెయిన్ సంక్షోభ పరిష్కారానికి జెడ్డాలో కీలక చర్చలు

హాజరైన 43 దేశాల భద్రతా సలహాదారులు, ప్రతినిధులు

రియాద్: ఏడాదిపైగా కొనసాగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధ సంక్షోభానికి పరిష్కారం కనుగొనేందుకు పశ్చిమ సౌదీ అరేబియాలోని తీరప్రాంత నగరమైన జెద్దాలో 43 దేశాలకు చెందిన భద్రతా సలహాదారులు, ప్రతినిధులు చర్చలు జరిపారు. రెండు రోజులపాటు సాగిన ఈ సమావేశం ఆదివారం ముగిసింది. ఉక్రెయిన్ సంక్షోభానికి పరిష్కారాలపై వారు చర్చించారు. ఈ రహస్య సమావేశానికి అనేక అభివృద్ధి చెందుతున్న దేశాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. సదరు దేశాల్లో చాలావరకు యుద్ధంలో తటస్థంగా ఉన్నాయి. యురేషియా వ్యవహారాలపై చైనా ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి లీ హుయ్ కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. చైనా భాగస్వామ్యం... శాంతిని పెంపొందించడంలో బాధ్యతాయుతమైన ప్రధాన దేశంగా దాని పాత్రను ప్రతిబింబిస్తుందని, యుద్ధ సంక్షోభాన్ని పరిష్కరించడంలో అంతర్జాతీయ సమాజం చేస్తున్న తాజా ప్రయత్నాలకు ఈ సమావేశం ప్రాతినిధ్యం వహిస్తుందని విశ్లేషకులు తెలిపారు. జెజియాంగ్ ఇంటర్నేషనల్ స్టడీస్ యూనివర్సిటీకి చెందిన 'ఇనిస్టిట్యూట్ ఫర్ స్టడీస్ ఆన్ ది మెడిటెర్రానియన్ రిమ్' పరిశోధకుడు లి జింగ్‌గాంగ్ మాట్లాడుతూ... జెద్దా సమావేశం సంక్షోభాన్ని పరిష్కరించడానికి గొప్ప అంతర్జాతీయ శాంతి దళాన్ని ముందుకు తెస్తుందని, సంక్షోభానికి న్యాయమైన మరియు శాశ్వత పరిష్కారాలను కనుగొనడానికి అధికసంఖ్యలో దేశాలు చర్చల్లో పాల్గొనడానికి ఇది వీలు కల్పిస్తుందని అభిప్రాయపడ్డారు. సౌదీ అరేబియాకు చెందిన అంతర్జాతీయ సమస్యల నిపుణుడు అబ్దుల్లా ఒటైబి మాట్లాడుతూ... ఉక్రెయిన్ యుద్ధ సంక్షోభం త్వరలో ముగిసే అవకాశం లేనప్పటికీ జెద్దా సమావేశాన్ని నిర్వహించడం సంక్షోభాన్ని పరిష్కరించడానికి సరైన దిశలో ఒక ముఖ్యమైన అడుగుగా పేర్కొన్నారు. అలాగే అన్ని పక్షాల మధ్య ఏకాభిప్రాయాన్ని పెంపొందించడానికి మంచి అవకాశమని తెలిపారు. మిడిల్ ఈస్ట్ కాలేజ్ ఆఫ్ బీజింగ్ లాంగ్వేజ్ అండ్ కల్చర్ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ వాంగ్ గ్వాంగ్యువాన్ మాట్లాడుతూ... జెద్దా సమావేశం, గతం మరియు భవిష్యత్తును కలిపే పరివర్తన కార్యక్రమమన్నారు. రష్యా పాల్గొనే విధంగా తదుపరి శాంతి సమావేశానికి మార్గం సుగమం చేస్తుందన్నారు. ఉక్రెయిన్ అధ్యక్ష కార్యాలయ చీఫ్ ఆఫ్ స్టాఫ్ ఆండ్రీ యెర్మాక్ ఒక ప్రకటన చేస్తూ... సమావేశంలో పాల్గొన్నవారు 'న్యాయమైన, శాశ్వత శాంతిని నిర్మించాల్సిన కీలక అంశాలపై చాలా ఆశాజనక సంప్రదింపులు జరిపారు' అని పేర్కొన్నారు. రష్యా భద్రతా మండలి డెప్యూటీ సెక్రటరీ డిమిత్రి మెద్వెదేవ్ మాట్లాడుతూ... చర్చల్లో ఇరుపక్షాలు పాల్గొనడం, చారిత్రక సందర్భాన్ని పరిగణనలోకి తీసుకోవడం, ప్రస్తుత వాస్తవాలను పరిగణనలోకి తీసుకుంటే మాత్రమే శాంతి ప్రతిపాదన విజయవంతమయ్యే అవకాశం ఉందని అన్నారు. ఈ సమావేశంలో చైనా ప్రతినిధి బృందం పాల్గొనడం అందరి దృష్టిని ఆకర్షించింది. చైనా విదేశాంగశాఖ ప్రతినిధి వాంగ్ వెన్‌బిన్ సమావేశానికి ముందు మాట్లాడుతూ ఉక్రెయిన్ సంక్షోభానికి రాజకీయ పరిష్కారం కనుగొనేందుకు నిర్మాణాత్మక పాత్రను కొనసాగించడానికి అంతర్జాతీయ సమాజంతో కలిసి పనిచేయడానికి చైనా సిద్ధంగా ఉందని చెప్పారు. కాగా ఉక్రెయిన్ సంక్షోభాన్ని పరిష్కరించడంలో చైనా వైఖరిని అంతర్జాతీయ సమాజం ఎల్లప్పుడూ విలువైనదిగా భావిస్తుందని, సంఘర్షణకు ముగింపు పలికేందుకు ఒప్పందాలు, మూల సూత్రాలను రూపొందించడంలో సానుకూల పాత్ర పోషిస్తుందని ఒటైబీ పేర్కొన్నారు. సౌదీ రాజకీయ విశ్లేషకుడు అహ్మద్ ఇబ్రహీం మాట్లాడుతూ ప్రపంచ శాంతి, అభివృద్ధిని ప్రోత్సహించడంలో చైనా ప్రధాన శక్తి అన్నారు. చైనా... ఉక్రెయిన్ యుద్ధ సంక్షోభంపై అన్ని సంబంధిత పక్షాలతో సంప్రదింపులు జరుపుతోందని, శాంతి చర్చలను చురుకుగా ప్రోత్సహిస్తోందని తెలిపారు.

కంబోడియా కొత్త ప్రధానిగా హున్ మానెట్

ఫ్నోమ్‌పెన్: కంబోడియా కొత్త ప్రధానమంత్రిగా హున్ మానెట్ నియమితులయ్యారు. ప్రస్తుత ప్రధానమంత్రి సామ్‌డెచ్ టెకో హున్ సేన్ పదవీవిరమణ చేస్తున్నట్లు ప్రకటించిన తర్వాత కంబోడియా రాజు నోరోడోమ్ సిహమోని సోమవారం హున్ మానెట్‌ను కొత్త ప్రధానమంత్రిగా నియమించారు.

హున్ సేన్ అభ్యర్థనను అనుసరించి ఐదేళ్ల కాలానిక కొత్త ప్రధానమంత్రిగా 45 ఏళ్ల హున్ మానెట్‌ను నియమిస్తూ... రాజు నోరోడోమ్ ఉత్తర్వులు జారీ చేశారు. నూతన ప్రధాని హున్ మానెట్... అధికారికంగా కొత్త ప్రధానమంత్రి కావాలంటే, ఆగస్టు 22న జరగనున్న నేషనల్ అసెంబ్లీలో విశ్వాస తీర్మానాన్ని నెగ్గాల్సి ఉంటుంది. అదే రోజున ఆయన తన కొత్త కేబినెట్ సభ్యులతో పాటు ప్రమాణ స్వీకారం చేస్తారని భావిస్తున్నారు. జులై 23న జరిగిన సార్వత్రిక ఎన్నికలలో హున్ సేన్‌కు చెందిన అధికార కంబోడియన్ పీపుల్స్ పార్టీ (సీపీపీ) జాతీయ అసెంబ్లీలోని 125 స్థానాలకు గాను 120 స్థానాలను గెలుచుకుని ఘనవిజయం సాధించిన తర్వాత ఈ నియామకం జరిగింది. హున్ మానెట్ ప్రస్తుతం సీపీపీ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా, రాయల్ కంబోడియన్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్‌కు డిప్యూటీ కమాండర్-ఇన్-చీఫ్‌గా ఉన్నారు. 38 ఏళ్లకు పైగా ప్రధాని పదవిలో కొనసాగిన తర్వాత తన పెద్ద కుమారుడు హున్ మానెట్‌కు అధికార పగ్గాలు అప్పగిస్తూ హున్ సేన్ జులై 26న తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. అయితే 71 ఏళ్ల హున్ సేన్... తాను సీపీపీ అధ్యక్షుడిగా కొనసాగుతానని, వచ్చే ఏడాది ఫిబ్రవరి 25న జరిగే సెనేట్ ఎన్నికల్లో సెనేట్ అధ్యక్ష పదవిని చేపడతానని చెప్పారు.

వెబ్ ఆప్షన్ల కోసం పడిగాపులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ ఈఏపీసెట్-2023 ఎంపీసీ విభాగంలో ఇంజినీరింగ్, ఫార్మసీ ప్రవేశాల వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ప్రారంభం రోజే గందరగోళానికి దారితీసింది. సోమవారం ఉదయం 10 గంటల నుంచి అభ్యర్థులు ఏపీ ఈఏపీసెట్ వెబ్‌సైట్‌లో ఆప్షన్లు పెట్టేందుకు ప్రయత్నించగా, వెబ్ ఆప్షన్లు 12 గంటల తర్వాత ఉంటాయంటూ సమాచారం ఇచ్చారు. ఆ తర్వాత దాదాపు సాయంత్రం 4 గంటలకు వెబ్ ఆప్షన్ల విభాగాన్ని వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. అప్పటివరకు అభ్యర్థులు పడిగాపులు పడాల్సి వచ్చింది. తమ ఆప్షన్లు పెట్టుకునేందుకు సిద్ధమవ్వగా, 5 గంటల తర్వాత వెబ్ ఆప్షన్ల విభాగాన్ని తొలగించి... మళ్లీ పెడతామని వేచి చూడాలంటూ సమాచారమిచ్చారు. దీంతో విద్యార్థులంతా ఏపీ ఈఏపీసెట్ వెబ్‌సైట్‌లో తాజా సమాచారం కోసం నిరీక్షించారు. దీనికి సాంకేతిక సమస్యలే కారణంగా భావిస్తున్నారు. దీనిపై విద్యార్థులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 179 ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలలకే ఈ కౌన్సెలింగ్‌కు ప్రభుత్వం అనుమతిచ్చింది. మరో 73 కళాశాలల్లో ప్రవేశాలకు అవకాశం కల్పించలేదు. తొలి విడత జరిగే ఈ వెబ్ కౌన్సెలింగ్‌కు ఆంధ్రప్రదేశ్‌తోపాటు తెలంగాణ రాష్ట్రం నుంచి దాదాపు 20వేలకుపైగా అభ్యర్థులు పాల్గొననున్నారు. ఇందులో ప్రభుత్వ, ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు, ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల్లోని సీట్లను ప్రభుత్వం నిర్ణయించిన కన్వీనర్ కోటా ఫీజులతో భర్తీ చేస్తారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అవకాశమున్న వారికి వాటిని మినహాయిస్తారు. ప్రైవేట్ విశ్వవిద్యాలయాల్లో 35శాతం కన్వీనర్ కోటా కింద సీట్లను కల్పించారు. అందులో సీట్లను యథాతథంగా రిజర్వేషన్ల కేటగిరీలుగా భర్తీ చేస్తారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ సౌకర్యమూ ఉంటుంది. ఉన్నతాధికారులు స్పందించి వెబ్ ఆప్షన్ల ప్రక్రియలో ఎలాంటి సాంకేతిక ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అభ్యర్థులు కోరుతున్నారు.

వాటికి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉండదు: కన్వీనర్ నాగరాణి

ఏపీ ఈఏపీసెట్-2023 ప్రవేశాల్లో భాగంగా 5 ఇంజినీరింగ్ కళాశాలల్లో స్వీయ మద్దతు (సెల్ఫ్ ఫైనాన్స్) కోర్సులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించబోదని ఏపీ ఈఏపీసెట్ కన్వీనర్ సి.నాగరాణి వెల్లడిరచారు. ఆయా ఇంజినీరింగ్ కళాశాలల్లోని బ్రాంచీలలో ప్రవేశాలు పొందిన వారంతా, ప్రభుత్వం నిర్ధారించిన ఫీజులను యథాతథంగా చెల్లించాల్సి ఉంటుంది. తిరుపతిలోని ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కాలేజీకి చెందిన సీఎస్ఈ, సీఏఐ, ఈసీఈ కోర్సులకు 1,49,940 ఫీజుగా నిర్ధారించారు. జేఎన్‌టీయూ కాకినాడలో సీఎస్ఎం కోర్సుకు రూ.75వేలు, విక్రం సింహపురి విశ్వవిద్యాలయంలో సీఎస్ఈ, సీఎస్‌డీ, సీఐవీ, ఈసీఈ, ఐఎన్ఎఫ్ కోర్సులకు రూ.65వేల చొప్పున ఫీజు నిర్ణయించారు. డాక్టర్ వైఎస్ఆర్ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్‌లో ప్లానింగ్, డిజైన్ విభాగాల కోర్సులకు రూ.60వేల చొప్పున వార్షిక ఫీజును ఈ సెల్ఫ్ ఫైనాన్స్ ఇంజినీరింగ్ కళాశాలలు వసూలు చేయనున్నాయి.

రూ.10 వేల సాగు సాయం ఇవ్వాల్సిందే

(మొదటిపేజీ తరువాయి)

తీసుకువచ్చిందని, ఆ చట్టాలకు వ్యతిరేకంగా రైతులు చేసిన ఉద్యమం అభినందనీయమన్నారు. కార్పొరేట్ సంస్థలకు లక్షల కోట్ల రూపాయలు మాఫీ చేస్తూ రైతులను ఎందుకు విస్మరిస్తున్నారని ప్రశ్నించారు. కరోనా కాలంలోనూ ప్రాణాలు సైతం లెక్కచేయకుండా పంటలు పండించి దేశ ప్రజలకు ఆహారం అందించిన రైతుల రుణం తీర్చుకోవాలంటే రుణమాఫీ జరగాల్సిందేనని డిమాండ్ చేశారు.

ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఐక్య ఉద్యమాలతో కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. రైతుల ఉద్యమానికి కార్మికవర్గం పూర్తి మద్దతు తెలియజేస్తోందన్నారు. విశాఖ ఉక్కు లాంటి ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతోందని, ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ అన్ని పంటలకు బీమా పథకం వర్తింపజేసి సర్వే నెంబర్ ఆధారంగా పరిహారం చెల్లించాలని, ప్రకృతి విపత్తుల వల్ల నష్టపోయిన ఆహార పంటలకు రూ.25వే లు, వాణిజ్య పంటలకు రూ.50 వేలు, ఉద్యాన పంటలకు లక్ష రూపాయల చొప్పున పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని కోరారు. 50 ఏళ్లు పైబడిన రైతు, కౌలు రైతులను ప్రతినెల పదివేల రూపాయల పింఛను అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య మాట్లాడుతూ డబుల్ ఫైనాన్స్‌తో సంబంధం లేకుండా కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వాలని కోరారు. సీఎం జగన్ తీసుకొచ్చిన నూతన కౌలురైతు చట్టాన్ని సవరించి భూ యజమాని ప్రమేయం లేకుండానే కౌలు గుర్తింపు కార్డులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. భూమిలేని కౌలు రైతులందరికీ రైతు భరోసా చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎ.కాటమయ్య, ఆంధ్రప్రదేశ్ చేతివృత్తుదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, సామాజిక వనరైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి హనుమాన్ రెడ్డి, రైతుసంఘం రాష్ట్ర నాయకులు కొమ్మన నాగేశ్వరరావు, సీహెచ్ కేశవ్ శెట్టి తదితరులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.చంద్రనాయక్, చిన్నం పెంచలయ్య బృందం రైతన్న పాటలతో అలరించింది. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుడితి అప్పలనాయుడు వందన సమర్పణ చేశారు.

మణిపూర్‌పై 'కమిటీ'

(మొదటిపేజీ తరువాయి)

షాలినీ పి.జోషి, ఢిల్లీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి ఆశా మీనన్ సభ్యులుగా ఉంటారని డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం తెలిపింది. రాష్ట్రంలో చట్టబద్ధమైన పాలనపై విశ్వాసాన్ని పునరుద్ధరించడమే సుప్రీం కోర్టు ప్రయత్నం అని న్యాయమూర్తులు జె.బి.పార్దివాలా, మనోజ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఇతర విషయాలతో పాటు సహాయ, పునరావాస ప్రయత్నాలను పర్యవేక్షించే జ్యుడీషియల్ ప్యానెల్‌ను, రాష్ట్ర సిట్‌లు విచారించాల్సిన నేర కేసుల దర్యాప్తును పర్యవేక్షించాల్సిందిగా పోలీసు ఉన్నతాధికారులను కోరకోరనున్నట్లు తెలిపింది. అంతేకాకుండా మహారాష్ట్ర మాజీ పోలీసు ప్రధానాధికారి దత్తాత్రే పద్సాల్గికర్‌ను నేర కేసులను దర్యాప్తును పర్యవేక్షించవలసిందిగా కోరింది. ముగ్గురు సభ్యుల ప్యానెల్ నేరుగా తమకు నివేదికలు సమర్పిస్తుందని కోర్టు పేర్కొంది. సరిహద్దు రాష్ట్రం మరింత గందరగోళంలోకి దిగడం, ఎక్కువ మంది ప్రజలు హత్యకు గురవటం, ఆస్తులకు నిప్పు పెట్టడం, అల్లకల్లోలం ప్రబలుతున్నట్లు నివేదికలను తెలుసుకున్న ధర్మాసనం... మహిళలను నగ్నంగా ఊరేగించిన వీడియో 'తీవ్రంగా కలవరపెడుతోంది' అని పేర్కొంది. కలహాలతో అట్టుడుకుతున్న రాష్ట్రంలో చట్టబద్ధ పాలనపై ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించడమే తమ ప్రయత్నమని గమనించిన అత్యున్నత న్యాయస్థానం అక్కడి మొత్తం పరిస్థితిని పర్యవేక్షించాలని కూడా నిర్ణయించింది. న్యాయమూర్తుల కమిటీ ఉపశమనం, నివారణ చర్యలు, పునరావాసం, పరిహారం, గృహాలు, ప్రార్థనా స్థలాల పునరుద్ధరణ వంటి అంశాలను పరిశీలిస్తుందని పేర్కొంది. న్యాయమూర్తుల కమిటీ సహాయక శిబిరాలను సందర్శించి అక్కడి పరిస్థితులను అంచనా వేస్తుందని తెలిపింది. కేసుల దర్యాప్తుపై 11 ఎఫ్ఐఆర్‌లను సీబీఐకి బదిలీ చేస్తామని తెలిపింది. వివరణాత్మక ఉత్తర్వులను సాయంత్రం తర్వాత సుప్రీం కోర్టు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తామని ధర్మాసనం పేర్కొంది. విచారణ సందర్భంగా, మణిపూర్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వినీత్ జోషి, మణిపూర్ డీజీపీ రాజీవ్ సింగ్ జాతి హింస, దానిని తనిఖీ చేయడానికి ఇప్పటివరకు తీసుకున్న చర్యలపై ప్రశ్నలకు సమాధానమివ్వడానికి ధర్మాసనం ముందు హాజరయ్యారు. అలాగే సమర్థవంతమైన దర్యాప్తు ప్రయోజనం కోసం కేసుల విభజన. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం తరపున హాజరయిన అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కేసుల విభజనతో సహా అంశాలపై ఆగస్టు 1న సుప్రీం కోర్టు కోరిన నివేదికను సమర్పించారు. 'ప్రభుత్వం చాలా పరిణతి చెందిన స్థాయిలో పరిస్థితిని నిర్వహిస్తోంది' అని అటార్నీ జనరల్ తెలిపారు. సున్నితమైన కేసులను విచారించేందుకు జిల్లా స్థాయిలో పోలీసు సూపరింటెండెంట్ నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాలను (సిట్) ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిందని ప్రభుత్వ న్యాయ అధికారులు తెలిపారు. మణిపూర్‌లో శాంతిభద్రతలు, రాజ్యాంగ యంత్రాంగాలు పూర్తిగా దెబ్బతిన్నాయని ఆగస్టు 1న అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. జాతి హింస, ముఖ్యంగా మహిళలను లక్ష్యంగా చేసుకునే సంఘటనలపై ఎఫ్ఐఆర్ నమోదులో 'జాప్యం', 'నిర్లక్ష్య' దర్యాప్తుకు సంబంధించి రాష్ట్ర పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆగస్టు 7న తన ప్రశ్నలకు సమాధానం ఇవ్వడానికి సుప్రీం కోర్టు పిలిపించింది. మే నెలలో మణిపూర్‌లో జాతి హింస చెలరేగడంతో 6,523 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు మణిపూర్ ప్రభుత్వం మొదట్లో ధర్మాసనానికి తెలిపింది. మణిపూర్‌లో హింసాకాండ సందర్భంగా మహిళలపై జరిగిన నేరాలు, దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన నేరాలకు సంబంధించి 12 ఎఫ్ఐఆర్‌లను సీబీఐ విచారిస్తుందని విచారణ సందర్భంగా సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీం కోర్టుకు తెలిపారు. ఉధృతంగా సాగుతున్న హింసాకాండకు సంబంధించిన దాదాపు 10 పిటిషన్లను ధర్మాసనం విచారణ చేస్తోంది. ఇందులో కేసులపై కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు చేయాలని కోరుతూ, ఉపశమనం, పునరావాస చర్యలకు సంబంధించిన చర్యలు కూడా ఉన్నాయి.

ఉద్యమ వీరుడికి అశ్రునివాళి

(మొదటిపేజీ తరువాయి)

ఎల్బీ స్టేడియం నుంచి గన్‌పార్క్, అంబేడ్కర్ విగ్రహం, అమరవీరుల స్థూపం, ట్యాంక్ బండ్ మీదుగా అల్వాల్ వరకు గద్దర్ అంతిమయాత్ర కొనసాగింది. అల్వాల్‌లోని ఆయన నివాసం వద్ద భౌతికదేహాన్ని కొంత సమయం ఉంచిన అనంతరం.. సమీపంలోని బోధి విద్యాలయం వరకు తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు.

కడసారి చూపుకోసం...

పాటనే ఆయుధంగా చేసుకుని సమాజంలో దోపిడి, అసమానతలపై చివరి దాకా పోరాడి దేశంలోనే అత్యంత ప్రభావవంతమైన విప్లవ గాయకుల్లో అగ్రగణ్యునిగా పేరొం దిన అభినవ వాగ్గేయకారుడికి అభిమానలోకం విప్లవ జోహార్లు పలికింది. గద్దర్ కడసారి చూపు కోసం వేలాదిగా జనం సందోహం తరలివచ్చింది. ఎల్బీ స్టేడియంలో సందర్శనార్థం ఉంచిన గద్దర్ భౌతికకాయానికి రాజకీయ, సినీ ప్రముఖులు నివాళులర్పించారు. కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, శాసనసభాపతి పోచారం శ్రీనివాసరెడ్డి, సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ, రాష్ట్ర మంత్రులు ఎర్రబెల్లి దయాకర్రావు, సబిత ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్

యాదవ్, ఇంద్రకరణ్ రెడ్డి, నిరంజన్‌రెడ్డి, ఏపీ మంత్రి బొత్స సత్యనారాయణ, కాంగ్రెస్ నేతలు మాణిక్‌రావ్ ఠాక్రే, రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, వీహెచ్, బీజేపీ నేతలు రఘునందనరావు, మేయర్ విజయలక్ష్మి, సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, విమలక్క, సినీ ప్రముఖులు పరుచూరి గోపాలకృష్ణ, మోహన్‌బాబు, మనోజ్, నాగబాబు, నిహారిక, అలీతో పాటు అనేక మంది కవులు, కళాకారులు, అభిమానులు వేలాదిగా తరలివచ్చి గద్దర్‌కు నివాళులు అర్పించారు. గద్దర్ పోరాటం, ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. మధ్యాహ్నం పన్నెం డున్నరకు ఎల్బీ స్టేడియంనుంచి గద్దర్ అంతిమయాత్ర ప్రారంభమైంది. డప్పు దరువులు జానపద కళాకారుల ఆటపాటలతో... నాంపల్లిలోని గన్‌పార్క్ అమర వీరుల స్తూపం వద్దకు చేరుకున్న గద్దర్ల అంతిమ యాత్ర... బషీర్‌బాగ్, ట్యాంక్ బండ్ మీదుగా అంతిమయాత్ర అల్వాల్‌లోని మహాబోధి స్కూల్ ఆవరణకు చేరుకోగా... గద్దర్ అమర్ రహే అంటూ అభిమానుల నినాదాలు చేశారు.

సోనియాగాంధీ సంతాపం

మరోవైపు ప్రజాగాయకుడు మరణ వార్త తెలిసి తాను చాలా బాధపడినట్లు... గద్దర్ భార్య విమలరావుకు కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్మన్ సోనియాగాంధీ లేఖ రాశారు. కళను, సంస్కృతిని వ్యక్తీకరణ సాధనాలుగా ఉపయోగించి అణగారిన వర్గాల్లో పోరాట పటిమను పెంచడంలో గద్దర్ కీలక పాత్ర పోషించారని ఆమె కొనియాడారు. గద్దర్ తన పాటలతో ప్రజా సమస్యలపై అవగాహన పెంచేందుకు అంకితభావంతో, నిబద్ధతతో పని చేశారని పేర్కొన్నారు. ఆయన ఆలోచనలు ఈతరం వారికి స్ఫూర్తి దాయకంగా నిలుస్తాయన్న సోనియాగాంధీ... గద్దర్ కుటుంబ సభ్యులకు సంతాపాన్ని తెలియజేశారు.

మావోయిస్టుల సంతాపం

ప్రజా గాయకుడు గద్దర్ మృతిపై మావోయిస్టు పార్టీ లేఖ విడుదల చేసింది. గద్దర్ మరణం తెలంగాణ ప్రజలందరికీ ఆవేదన కల్గించిందని తెలంగాణ రాష్ట్ర మావోయిస్టు కమిటీ లేఖలో వివరించింది. గద్దర్ అంటే దేశంలో, రాష్ట్రంలో తెలియని వారు లేరన్నారు. గద్దర్ మరణం మమ్మల్ని తీవ్రంగా బాధకు గురిచేసిందన్నారు. గద్దర్ కుటుంబానికి తమ సానుభూతి తెలియజేస్తున్నామన్నారు. నక్సల్బరీ, శ్రీకాకుళం పోరాటాల ప్రేరణతో తెలంగాణలో భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం చేశారని లేఖలో పేర్కొన్నారు. బుర్ర కథలు, పాటలు, నాటికలు, ఒగ్గు కథలతో పీడిత ప్రజలను చైతన్యపరిచారని తెలియజేశారు. జననాట్య మండలి ఏర్పాటులో గద్దర్ కృషి ఉందన్నారు.

రాజా సంతాపం

ప్రజాగాయకుడు, కవి గద్దర్ మృతికి సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. ఆయన మరణం మొత్తంగా కమ్యూనిస్టు ఉద్యమానికి, పేదవర్గాలకు, సమాజానికి నష్టమని రాజా అన్నారు. పీడిత, తాడిత, అణగారిన ప్రజల అభివృద్ధి కోసం పాటలు, రచనల ద్వారా ఎంతో కృషి చేశారని తెలిపారు. గద్దర్ మృతికి సంతాపం, వారి కుటుంబసభ్యులకు సానుభూతిని డి. రాజా తెలిపారు.

సభకు రాహుల్

(మొదటిపేజీ తరువాయి)

సభ్యత్వాన్ని పునరుద్ధరించడాన్ని ప్రశంసించారు. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఈ నిర్ణయం 'స్వాగతించదగిన చర్య' అని, ఇది భారతదేశ ప్రజలకు, ముఖ్యంగా వాయనాడ్‌కు ఉపశమనం కలిగిస్తుందని అన్నారు. 'తమ పదవీకాలం మిగిలి ఉన్నందున, బీజేపీ, మోదీ ప్రభుత్వం ప్రతిపక్ష నాయకులను లక్ష్యంగా చేసుకుని ప్రజాస్వామ్యాన్ని కించపరచడం కంటే వాస్తవ పాలనపై దృష్టి పెట్టడం ద్వారా దానిని ఉపయోగించుకోవాలి' అని ఖర్గే ట్విట్టర్‌లో పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా కూడా రాహుల్ గాంధీ తిరిగి లోక్‌సభకు రావడాన్ని కొనియాడారు. 'ప్రజల నిజమైన సమస్యల గొంతు' మరోసారి పార్లమెంటులో ప్రతిధ్వనిస్తుందని అన్నారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కేసీ వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యం గెలిచింది. భారత్ గెలుస్తుంది. రాహుల్ గాంధీ పార్లమెంటరీ యాత్రను ఎటువంటి సంకోచం లేకుండా నిజం మాట్లాడటం ద్వారా కొనసాగిస్తారు. ఆయన భారతదేశం గొంతు. ఆయనను ఎప్పటికీ నిశ్శబ్దం చేయలేరు' అని తెలిపారు. అనేక మంది ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇన్‌క్లూజివ్ అలయన్స్ (ఇండియా) నాయకులు సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్‌తో కలిసి గాంధీ తిరిగి ఎంపీగా రావడంపై ప్రశంసలు కురిపించారు. పార్టీ నాయకుడు మహ్మద్ ఆజం ఖాన్, ఆయన కుమారుడు అబ్దుల్లా ఆజం కూడా ఉత్తర ప్రదేశ్ అసెంబ్లీ సభ్యత్వం పునరుద్ధరిస్తారని ఆశిస్తున్నట్లు చెప్పారు. గాంధీ మళ్లీ సభకు రావడం చాలా మంచిదని జమ్మూ కాశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా అన్నారు. అనేక మంది ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇన్‌క్లూజివ్ అలయన్స్ (ఇండియా) నాయకులతో పాటు సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ రాహుల్ గాంధీ తిరిగి ఎంపీగా రావడంపై ప్రశంసలు కురిపించారు. తమ పార్టీ నాయకుడు మహ్మద్ ఆజం ఖాన్, ఆయన కుమారుడు అబ్దుల్లా ఆజం ఉత్తర ప్రదేశ్ అసెంబ్లీ సభ్యత్వం కూడా పునరుద్ధరిస్తారని ఆశిస్తున్నట్లు చెప్పారు. గాంధీ మళ్లీ సభకు రావడం చాలా మంచిదని జమ్మూ కాశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా అన్నారు.

తన ట్విట్టర్ బయో మార్చిన రాహుల్

తన లోక్‌సభ సభ్యత్వాన్ని పునరుద్ధరించడంతో రాహుల్ గాంధీ తన ట్విట్టర్ బయోని మునుపటి 'డిస్'క్వాలిఫైడ్' వివరణ నుంచి 'మెంబర్ ఆఫ్ పార్లమెంట్'గా మార్చారు. అతని ట్విట్టర్ బయో ఇప్పుడు అతన్ని భారత జాతీయ కాంగ్రెస్ సభ్యుడు, పార్లమెంటు సభ్యునిగా అభివర్ణించింది. గుజరాత్ కోర్టు పరువు నష్టం కేసులో రాహుల్ గాంధీని దోషిగా నిర్ధారించి రెండేళ్ల జైలు శిక్ష విధించడంతో మార్చిలో గాంధీపై అనర్హత వేటు పడింది. రెండు సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ శిక్ష అనేది చట్టసభ సభ్యులను స్వయంచాలకంగా అనర్హులను చేస్తుంది. శుక్రవారం సుప్రీం కోర్టు ఆయన దోషిపై స్టే విధించి, ఆయన లోక్‌సభ సభ్యత్వం పునరుద్ధరణకు మార్గం సుగమం చేసింది. స్టే వల్ల గాంధీ 2024 లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు కూడా వీలు కలుగుతుంది. 53 ఏళ్ల గాంధీ లోక్‌సభలో వాయనాడ్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇక్కడి ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో కూడా కార్యకర్తలు నృత్యాలు చేస్తూ రాహుల్ గాంధీకి అనుకూలంగా నినాదాలు చేస్తూ సంబరాలు చేసుకున్నారు.

వైద్యవిద్య పేదలకు దూరం

(మొదటిపేజీ తరువాయి)

కళాశాలల్లో 50 శాతం సీట్లను కన్వీనర్ కోటా కింద, 50 శాతం సీట్లను బీ, సీ కేటగిరీల కింద సీట్లు భర్తీ చేయాలని 107, 108 జీవోలు తీసుకురావడం దుర్మార్గమని విమర్శించారు. అన్ని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 100 శాతం కన్వీనర్ కోటాలో సీట్లు భర్తీ చేస్తుంటే...నూతనంగా ప్రారంభిస్తున్న వైద్య కళాశాలల్లో 50 శాతమే ఎందుకు కేటాయిస్తున్నారని ప్రశ్నించారు. పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులను ఉన్నత చదువులు చదివించే బాధ్యత తనదేనని చెప్పిన వైఎస్ జగన్...ఇపుడు పేద విద్యార్థులను వైద్యవిద్యకు ఎందుకు దూరం చేస్తున్నారని నిలదీశారు. ప్రైవేట్ వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్ చదవడం సామాన్యులకు సాధ్యం కాదని, సంపన్న వర్గాలు మాత్రమే కోట్ల రూపాయలు ఫీజు చెల్లిస్తున్నారని, కొంతమంది విదేశాలకు వెళ్లి వైద్యవిద్య అభ్యసిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ జీవోల వల్ల ప్రతిభ గల పేద విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. నూతనంగా ప్రారంభిస్తున్న వైద్య కళాశాలల్లో 100 శాతం కన్వీనర్ కోటా కింద సీట్లు భర్తీ చేసేంత వరకు పోరాటం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అరెస్ట్ అయిన వారిలో జాన్సన్‌బాబు, శివారెడ్డితోపాటు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మస్తాన్ షరీఫ్, నాసర్, కోశాధికారి సాయికుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వలరాజు, నాగరాజు, రమణయ్య, రవి, విద్యార్థులు ఉన్నారు.

రైతు రుణభారంలో ఏపీ రెండోస్థానం

(మొదటిపేజీ తరువాయి)

అడిగిన ప్రశ్నకు కేంద్ర ప్రభుత్వం వివరాలు వెల్లడించింది. వాణిజ్య బ్యాంకులు, సహకార బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల నుంచి ఏపీ రైతుల రుణాలు మొత్తం రూ.2,43,073 కోట్లుగా ఉన్నట్లు కేంద్రం పేర్కొంది. తెలంగాణ రైతుల రుణభారం రూ.1,12,492 కోట్లుగా ఉంది. దేశంలో తొమ్మిది రాష్ట్రాల్లో ఒక్కో రాష్ట్రంలో లక్ష కోట్లకు మించి రైతుల రుణభారం పెరిగిందని కేంద్రం వెల్లడించింది. మొదటి స్థానంలో తమిళనాడు నిలవగా... రెండోస్థానంలో ఆంధ్రప్రదేశ్, మూడోస్థానంలో కర్నాటక, నాలుగో స్థానంలో ఉత్తరప్రదేశ్, ఐదోస్థానంలో మహారాష్ట్ర, ఆరోస్థానంలో కేరళ, ఏడో స్థానంలో తెలంగాణ, ఎనిమిదో స్థానంలో గుజరాత్, తొమ్మిదో స్థానంలో మధ్యప్రదేశ్ ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.

2.62 లక్షల మంది వీధివర్తకులకు రుణాలు

ఆంధ్రప్రదేశ్‌లో ప్రధానమంత్రి స్వానిధి పథకం కింద ఇప్పటి వరకు 2,62,811 మంది వీధి వర్తకులకు రుణాలు మంజూరు చేసినట్లు కేంద్ర హౌసింగ్, పట్టణ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి కౌశల్ కిషోర్ వెల్లడించారు. వైసీపీ సభ్యుడు విజయసాయి రెడ్డి రాజ్యసభలో సోమవారం అడిగిన ప్రశ్నకు మంత్రి రాతపూర్వకంగా జవాబిస్తూ 2022-23లో 49,534 మందికి, 2023-24 ఆగస్టు 2 నాటికి 12,097 మంది వీధివర్తకులకు రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. కోవిడ్ మహమ్మారి ప్రభావంతో దెబ్బతిన్న వ్యాపారాలను పునఃప్రారంభించుకునేందుకు వీలుగా వీధివర్తకులకు కొలేటరల్ ఫ్రీ వర్కింగ్ కేపిటల్ రుణాలు అందించే లక్ష్యంతో కేంద్రం 2020 జూన్ 1న ప్రధానమంత్రి వీధి వర్తకుల ఆత్మనిర్భర్ నిధి (పీఎం స్వానిధి) పథకం ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. ఈ పథకం కింద ఒక్కో వర్తకుడికి మొదటి ఏడాది రూ.10 వేల రుణం అందించి, అది సకాలంలో తిరిగి చెల్లించిన తర్వాత రెండవ విడతలో రూ.20 వేలు, మూడవ విడతలో 50 వేల రుణం అందిస్తున్నట్లు తెలిపారు. రుణ బకాయిలను సకాలంలో తిరిగి చెల్లించిన వారికి వడ్డీలో సంవత్సరానికి 7 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు తెలిపారు. డిజిటల్ లావాదేవీలు జరిపిన వారికి సంవత్సరానికి రూ.1200 క్యాష్ బ్యాక్ ప్రోత్సాహం కల్పిస్తున్నట్లు తెలిపారు. విజయనగరంలో 46.96 కోట్ల రూపాయల వ్యయంతో అమృత్ పథకం కింద రెండు నీటి సరఫరా ప్రాజెక్టులు, ఒక సేవేజ్, సెప్టేజ్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టుతో పాటు మూడు పార్కుల అభివృద్ధి చేపట్టగా అవి వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయని మరో ప్రశ్నకు సమాధానంగా మంత్రి కౌశల్ కిషోర్ తెలిపారు.

పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తాం

2025 ఖరీఫ్ నాటికి

- కేంద్రం కరుణిస్తేనే పునరావాస ప్యాకేజీ
- లైడార్ సర్వే ప్రామాణికం
- ముంపు ప్రాంతాల పర్యటనలో ముఖ్యమంత్రి జగన్

విశాలాంధ్రబ్యూరో-ఏలూరు/కూనవరం: 2025 ఆగస్టు నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం గొమ్ముగూడెం లోని వరద ప్రభావిత ప్రాంతాలలో ముఖ్యమంత్రి జగన్ సోమవారం పర్యటించారు. గ్రామంలోని బాధిత ప్రజలతో ముఖ్యమంత్రి జగన్ ముఖాముఖి నిర్వహించి సమస్యలు అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ మాట్లాడుతూ... చంద్రబాబు నిర్వాకం వల్ల పోలవరం ప్రాజెక్టు ఆలస్యమైందని ఆరోపించారు. వరద సహాయక చర్యల్లో ఎక్కడైనా పొరపాటు జరిగితే పరిష్కరిస్తామన్నారు. పోలవరం ప్రాజెక్టులో 3 దశల్లో నీళు నింపుతామన్నారు. మొదటి దశలో 41.15 లో నీళ్లు నింపడానికి కేంద్రం అనుమతి ఇచ్చిందన్నారు. చంద్రబాబు హయాంలో ఇష్టం వచ్చినట్లు ప్లానింగ్ లేకుండా ప్రాజెక్టు కట్టం వల్లే ముంపు సమస్య అన్నారు. ఏ బాధ వచ్చినా ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. పోలవరం ప్రాజెక్టును తాము ఎందుకు త్వరగా పూర్తి చేయలేకపోతున్నామో కూడా జగన్ తెలిపారు. 2013-14 ధరలతో ఇప్పుడు ఎలా పూర్తి చేస్తామని ప్రశ్నించారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కోసం కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నామని, కేంద్రం నిధులకు తోడు రాష్ట్రం నిధులతో పూర్తి చేస్తామన్నారు. ప్రాజెక్టు విషయంలో సవరించిన అంచనాలకు కేంద్ర కేబినెట్ ఈ నెలాఖరులో ఆమోదం తెలపాల్సి ఉందన్నారు. కేంద్రం ఈ విషయంలో సానుకూలంగా ఉందన్నారు. పోలవరం ప్రాజెక్టు విషయంలో తమ ప్రభుత్వం క్రెడిట్ కోసం ఆలోచించడం లేదన్నారు. జనవరి నాటికి రూ.5,200 కోట్లు వచ్చేలా చూస్తామన్నారు. పోలవరం ముంపు బాధితులందరికీ న్యాయం చేస్తామని జగన్ చెప్పారు. వరద బాధితులకు సాయం అందకుంటే ఫిర్యాదు చేయవచ్చునని చెప్పారు. లిడార్ సర్వే సైంటిఫిక్‌గా జరిగిందని, అందరికీ న్యాయం జరుగుతుం దన్నారు. నిర్వాసితుల నష్టపరిహారం కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న 6.28 లక్షలకు తోడు రాష్ట్ర ప్రభుత్వం తరఫున మరో రూ.3.2 లక్షలు ఇస్తామని దీనికి సంబంధించి జీవో జారీ చేశామన్నారు. ముఖ్యమంత్రి జగన్ పర్యటనను పురస్కరించుకొని ఆదివారం రాత్రి గ్రామంలోని కొంతమంది నిర్వాసితులకు అప్పటికప్పుడు రూ.6.28 లక్షల నష్టం పరిహారం వారి ఖాతాలోకి జమ చేసినట్లు తెలిసింది. ముఖ్యమంత్రి ముఖాముఖి కార్యక్రమానికి ఎంపిక చేసినటువంటి కొంతమంది నిర్వాసితులను మాత్రమే అనుమతించారు. నష్ట పరిహారం చెల్లింపు విషయంలో కొంతమంది మహిళలు తమ గోడు వెళ్ళబోసుకోవడానికి వచ్చినా పోలీసులు అనుమతించలేదు.ఎప్పటిలాగే మీడియాపై ఆంక్షలు విధించారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసులకు సైతం సరైన మౌలిక వసతులు కల్పించకపోవడంతో అసంతృప్తికి గురయ్యారు. తొలుత హెలిపాడ్ వద్ద ముఖ్యమంత్రి జగన్ కు మంత్రులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, హోంశాఖ మంత్రి తానేటి వనిత, జిల్లా ఇన్చార్జ్ మంత్రి పినిపే విశ్వరూప్, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి జిల్లాలో...: అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం, వీఆర్‌పురం మండలాల వరద బాధిత గ్రామాల ప్రజలతో సీఎం జగన్ ముఖాముఖి నిర్వహించారు. వరదలు వచ్చినప్పుడు తాను ఫోటోల కోసం వచ్చి వెళ్లకుండా బాధితులను ఆదుకునే విధంగా అధికారులకు అన్ని రకాలుగా అవసరమైన వనరులు ఇచ్చానని తెలిపారు. వారం రోజుల పాటు అధికారులు సహాయక కార్యక్రమాల్లో అలసత్వం లేకుండా పని చేశారని, గ్రామ సచివాలయాల దగ్గర నుంచి వలంటీర్ల వ్యవస్థ వరకు ప్రతి వ్యవస్థను క్రియాశీలం చేసి ఏ ఒక్కరికి ఇబ్బంది కలగకుండా చూశామన్నారు. వరద సాయం అందనివారు ఇక్కడికి వచ్చి నాకు చెప్పండి అంటూ బాధితులను కోరారు. ఇల్లు దెబ్బతింటే... వ్యత్యాసం చూపకుండా ప్రతి ఇంటికి రూ.10 వేలు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశాని తెలిపారు. గతంలో కూనవరం మండలంలో గజ్జరాయి గూడెం అనే ఒకే ఒక గ్రామం 41.15 కాంటూర్ లో ఉండేదని, మన ప్రభుత్వం వచ్చాక ప్రత్యేకంగా మరోసారి సర్వే చేయించి అదనంగా 32 గ్రామాలను అంటే 48 హ్యాబిటేషన్లను 41.15 కాంటూర్ లో చేర్చామని తెలిపారు. ఈ గ్రామాల జాబితాను కేంద్ర ప్రభుత్వానికి పంపించామని, నీరు నింపాలంటే మూడు దఫాలుగా నింపాలని, లేదంటే డ్యామ్ లీకేజీ అవుతుందన్నారు. మొదటి దశలో 41.15 అడుగుల దాకా డ్యామ్‌లో నీరు నింపేందుకు కేంద్రం అనుమతి ఇచ్చిందని తెలిపారు. కేంద్రం అంగీకారం తెలిపితే ఆ కాంటూర్ పరిధిలోకి వచ్చే ప్రతి నిర్వాసితులకు ప్యాకేజీ ఇస్తామని, ఆర్ అండ్ ఆర్ ఇచ్చేవారికి పరిహారం ఇస్తామని సీఎం భరోసా ఇచ్చారు. ఈ నెలాఖరులోగా కేంద్ర కేబినెట్ ఆమోదం పొందవచ్చని, సీడబ్ల్యూసీ కి కూడా వారం రోజుల క్రితమే ఈ జాబితా చేరిందని తెలిపారు. కేంద్రమే నేరుగా నిర్వాసితుల ఖాతాలో డబ్బులు వేసినా పర్లేదని ఆ పేరు నాకు అవసరం లేదని, నాకు కావాల్సిందల్లా ప్రజలకు మంచి జరగటమేనని అన్నారు. కచ్చితంగా ఎన్నికలకు వెళ్లేలోపలే మంచి జరుగుతుందని భావిస్తున్నానని అన్నారు. వచ్చే ఆరు ఏడు నెలల్లో అందరికీ అన్నీ అందుతాయని సీఎం జగన్ తెలిపారు.

గద్దర్‌కు ప్రజానాట్యమండలి ఘన నివాళి

విశాలాంధ్ర-విజయవాడ: ప్రజా యుద్ధనౌక, ప్రజావాగ్గేయకారుడు, పోరు పాట గద్దర్‌కు ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి ఘనంగా నివాళులర్పించింది. గద్దర్ మృతికి సంతాప సూచకంగా సోమవారం ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో విజయవాడ దాసరి భవన్ సీపీఐ రాష్ట్ర కార్యాలయం వద్ద గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి చంద్రానాయక్, చిన్నం పెంచలయ్య మాట్లాడుతూ గద్దర్ తన ఆట పాటలతో ప్రజలను చైతన్యవంతం చేసి ప్రజా పోరాటాలలోకి యువతరాన్ని ఉరికించి ఉత్తేజపరిచిన మహా గాయకుడని కొనియాడారు. గద్దర్ ఏ ఒక్క అంశానికి పరిమితమై పాటలు రాయలేదని ప్రకృతి సిద్ధంగా కనిపిస్తున్న ప్రతి వస్తువుపై ప్రతి సమస్యపై ప్రతి ఉద్యమంపై ఆయన పాట ప్రగాఢ ముద్ర వేసుకున్నదని తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనేపూడి శంకర్ మాట్లాడుతూ గద్దర్ పాటకే పరిమితం కాకుండా పాటతో పాటు తన హావ భావాలను వ్యక్తపరుస్తూ ప్రజల్ని ఆకట్టుకోవడానికి తన వంతు కర్తవ్యంగా పాటకు ప్రాణం పోశాడన్నారు. ఆల్ ఇండియా దళిత్ ఫోరం మూమెంట్ (ఏఐడీఆర్ఎం) జాతీయ నాయకులు వీఎస్ నిర్మల్ మాట్లాడుతూ గద్దర్ రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన గాయకుడు కాదని అనేక రాష్ట్రాలలో హిందీలో పాటలు పాడి వారందరినీ కూడా మెప్పించిన గాయకుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి కళాకారులు గద్దర్‌ను స్మరిస్తూ అనేక పాటలు పాడి ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర కోశాధికారి ఆర్. పిచ్చయ్య, ఉపాధ్యక్షులు ఎస్కే నజీర్, విజయవాడ నగర నాయకులు లంక దుర్గా రావు, గాయకులు దప్పు సూరి , బాషా, కర్ణాటక మహేశ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పడకేసిన పోలవరం

టీడీపీ హయాంలో 72శాతం పూర్తి

వైసీపీ నాలుగేళ్లలో 4 శాతం పనులే: చంద్రబాబు విమర్శ

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: ప్రాజెక్టు నిర్మాణాలను కొనసాగించకపోవడం, ప్రాజెక్టుల పరిశీలనకు వెళ్లకుండా ప్రతిపక్షాలను అడ్డుకోవడం సిగ్గు చేటని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి యుద్ధభేరిలో భాగంగా పోలవరం ప్రాజెక్టు, పట్టిసీమ, చింతలపూడి ఎత్తిపోతల పథకాలను చంద్రబాబు సోమవారం సందర్శించారు. పోలవరం ప్రాజెక్టు స్పిల్ వే, కాఫర్ డ్యాం మునకకు సంబంధించిన వివరాలను నీటిపారుదల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు పనులను పరిశీలించారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ 2004 నుండి 2009 వరకు పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి కేవలం ఐదు శాతం పనులు మాత్రమే చేశారన్నారు. పీపీఏ ప్రస్తావించిన అంశాలను గుర్తు చేస్తూ టీడీపీ హయాంలో పోలవరం ప్రాజెక్టు పనులు శరవేగంగా జరిగాయని చెప్పారు. తమ హయాంలో 72 శాతం పనులు పూర్తి చేశామని, 29 సార్లు క్షేత్రస్థాయి పర్యటనతో పాటు 82 సార్లు వర్చువల్ పరిశీలన చేశానన్నారు. రెండు కిమీ మేర డయాఫ్రమ్ వాల్ నిర్మాణం పూర్తి చేశామన్నారు. పోలవరం ప్రాజెక్టుపై తాము రూ.11,537 కోట్లు ఖర్చు పెడితే...వైసీపీ కేవలం రూ.4,611 కోట్లు ఖర్చు పెట్టిందని విమర్శించారు. తాము పోలవరం ఎత్తు 45.72 మీటర్లు అంటే...వైసీపీ 41.15 మీటర్లు అంటుం దన్నారు. టీడీపీ హయాంలో ప్రాజెక్టు పనులు 72 శాతం పూర్తయితే...వైసీపీ హయాంలో 4 శాతం మాత్రమే పూర్తి చేశారని మండిపడ్డారు. తాము పోలవరం ప్రాజెక్టును పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దితే...వైసీపీ నిషేధిత ప్రాంతంగా మార్చిందని ఆరోపించారు. పోలవరంపై అబద్ధాలతో పుస్తకాలు వేశారని, తమ హయాంలో పోలవరంలో అవినీతి జరగలేదని స్వయానా కేంద్రమే నివేదికలు ఇచ్చిందని గుర్తుచేశారు. 2019 ఎన్నికల తర్వాత 18 నెలలపాటు ముఖ్యమంత్రి జగన్ పోలవరం పనులే చేపట్టలేదని, రివర్స్ టెండరింగ్ పేరుతో కాలయాపన చేశారని విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్ అసమర్థత కారణంగా డయాఫ్రమ్ వాల్ దెబ్బతిన్నదన్నారు. పోలవరం ప్రాజెక్టుకు భద్రత లేకపోతే గోదావరి జిల్లాల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఆర్ అండ్ ఆర్ నిర్వాసిత కాలనీలను ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. అనంతరం చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును చంద్రబాబు పరిశీలించారు. తాము రూ.4909 కోట్ల అంచనాతో ప్రాజెక్టు పనులు ప్రారంభించి...రూ.2289 కోట్లు ఖర్చు పెట్టామన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలో 4.80 లక్షల ఎకరాలకు సాగునీరు ఇచ్చేలా ప్రాజెక్టు రూపకల్పన చేశామన్నారు. చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు వద్ద సెల్ఫీ దిగి చంద్రబాబు చాలెంజ్ విసిరారు. చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేకపోయారని చంద్రబాబు ప్రశ్నించారు. కాగా, పోలవరం ప్రాజెక్టు పరిశీలన కోసం చంద్రబాబుతో పాటు 14 మంది నాయకులకు మాత్రమే పోలీసులు అనుమతించారు. చంద్రబాబు వెంట వెళ్లేందుకు ఎక్కువమందికి అనుమతివ్వకపోవడంతో పోలవరం సెంటర్‌లో టీడీపీ కార్యకర్తలు నిరసనకు దిగారు. చంద్రబాబు వెంట మాజీ మంత్రులు దేవినేని ఉమా, పీతల సుజాత, జవహర్, పితాని సత్యనారాయణ, టీడీపీ పోలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, మొడియం శ్రీనివాసరావు, టీడీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు నాయకులు ఉన్నారు.

రిజర్వేషన్ల ప్రకారం సీట్లు భర్తీ చేయాలి

ముఖ్యమంత్రికి ఈశ్వరయ్య లేఖ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : రాష్ట్ర ప్రభుత్వం 107, 108 జీవోలు జారీ చేసి ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల విద్యార్థులకు వైద్య విద్య అందని ద్రాక్షలా చేసిందని పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి రాసిన లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి 17 వైద్య కళాశాలలకు కొత్తగా అనుమతులు సాధించేందుకు ముఖ్యమంత్రి చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. అయితే కేవలం సగం సీట్లలో మాత్రమే రిజర్వేషన్ వర్తింపజేయడం దారుణమని, ఇది రాజ్యాంగ నియమాలకు విరుద్ధంగా ఉందని ఆలేఖలో పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లోనే అణగారిన వర్గాల రిజర్వేషన్లకు తూట్లు పొడుస్తుంటే ... ప్రైవేటు కళాశాలలు రిజర్వేషన్లు ఎలా అమలు చేస్తాయని ప్రశ్నించారు. బీసీ,ఎస్సీ,ఎస్టీ,మైనార్టీల సంక్షేమం గురించి ఆలోచించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వర్గాలకు విరుద్ధం ప్రభుత్వం విడుదల చేసిన జీవోలను వెనక్కి తీసుకోవాలని ఈశ్వరయ్య విజ్ఞప్తి చేశారు. కొత్తగా ప్రారంభమవుతున్న మచిలీపట్నం మెడికల్ కాలేజీలో 150 సీట్లకు గానూ 22 సీట్లు ఆలిండియా కోటాలో పోతే మిగిలిన 128 సీట్లు వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ తరపున కన్వీనర్ కోటాలో ఏ కేటగిరీలో ఉండాలన్నారు. ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 6 శాతం, బీసీ- ఏ 7 శాతం, బీసీ- బీ 10 శాతం, బీసీ- సీ 1 శాతం, బీసీ- డీ 7 శాతం, బీసీ- ఈకి 4 శాతం కేటాయించాలని కోరారు. దీన్ని అనుసరించి ఎస్సీలకు 20 సీట్లు, ఎస్టీలకు 8 సీట్లు, బీసీ- ఏ 9 సీట్లు, బీసీ- బీ 13 సీట్లు, బీసీ- సి కి ఒక్క సీటు, బీసీ- డీ కి 9, బీసీ- ఈ 5 సీట్ల వరకూ సుమారుగా దక్కాల్సి ఉంటుందని ఈశ్వరయ్య పేర్కొన్నారు. మొత్తం బీసీ ఎస్సీ ఎస్టీలకు కలిపి 64 సీట్లు రావాలి. అవి కాకుండా స్పోర్ట్స్, ఎన్‌సీసీ, పోలీసు అమరవీరులకు రిజర్వేషన్ కోటాలో సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ నిర్ణయం మూలంగా అదే మచిలీపట్నం మెడికల్ కాలేజీలో ఆలిండియా కోటా పోగా మిగిలిన 128 సీట్లలో 64 సీట్లను బీ, సీ కేటగిరీలుగా మార్చేశారని, వాటికి ఫీజులు నిర్ణయించాలన్నారు. రిజర్వేషన్లు అమలు చేయబోమంటూ జీవోలో పేర్కొన్నారని, దానర్థం ప్రభుత్వ విద్యా సంస్థలో రిజర్వేషన్లు తొలగిస్తున్నట్లేనని ఈశ్వరయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. దీని మూలంగా 64 సీట్లకు మాత్రమే రిజర్వేషన్లు వర్తిస్తాయని, అందులో సగం సీట్లకు మాత్రమే ఎస్సీ, ఎస్టీ బీసీలకు దక్కుతాయన్నారు. తక్షణమే 107, 108 జీవోలను రద్దు చేయాలని, యథావిధిగా రిజర్వేషన్లను వర్తింపజేయాలని ముఖ్యమంత్రికి ఈశ్వరయ్య విజ్ఞప్తి చేశారు.

నిరాశపరచిన సీఎం వరద ప్రాంతాల సందర్శన

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

విశాలాంధ్ర-విజయవాడ: అల్లూరి జిల్లా కూనవరం, ఏలూరు జిల్లా కుక్కునూరులలో ముఖ్యమంత్రి వరద ప్రాంతాల పర్యటన నిరాశపరిచిందనీ, గతంలో చెప్పిన విషయాలనే మరలా ప్రస్తావించారు తప్ప కొత్తదనమేదీ లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 41.5 కాంటూరు వద్ద అదనంగా 32గ్రామాలను మొదట ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ క్రిందిన చేరుస్తున్నామని చెబుతున్నారని తెలిపారు. గత సంవత్సరం వరదల్లో 37 మీటర్లకే 193 గ్రామాలు మునిగాయని ప్రజలు ఎంత ఆందోళన చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వానికి చెవికెక్కడం లేదని విమర్శించారు. 41.5 మీటర్ల ఎత్తు వరకు మునిగే గ్రామాలదే తన బాధ్యత అని చెబుతున్న సీఎం 41 మీటర్లలోపు మునిగిన గ్రామాల గురించి ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. కాంటూరు లెక్కలే తప్పని లిడార్ సర్వే రుజువు చేసిందని గుర్తు చేశారు. డ్యాం నిర్మాణంకోసం ఉదారంగా నిధులిస్తున్న ప్రభుత్వాలు నిర్వాసితులకు ఎందుకు ఇవ్వరు? కాంట్రాక్టర్లకు ఒకచట్టం, నిర్వాసితులకు మరోచట్టం ఉందా? అని నిలదీశారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా అనేక మందిని గృహ నిర్బంధంలో ఉంచి ఎంపిక చేసిన వారిని సభకు తరలించి చప్పట్లు కొట్టించుకోవడం అవమానకరం అన్నారు.

ఆయన రంగులేస్తే.. ఈయన పంగనామాలు పెడుతున్నాడు..

బీవీ రాఘవులు ధ్వజం

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగస్టు 15 సందర్భంగా కర్నూలుకు వస్తూ రోడ్లకు రంగులేసి మొత్తం పని పూర్తయిందన్నారు.. నేటి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఏకంగా కర్నూలు జిల్లాకు పంగనామాలు పెడుతున్నారన్నారని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు ధ్వజమెత్తారు. కర్నూలు జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం సీపీఎం జులై 2 నుంచి తలపెట్టిన మహా పాదయాత్ర ఏడవ రోజు తాజ్ ఫంక్షన్ హాల్ నుంచి బయలుదేరి రేణుక ఎల్లమ్మ దేవాలయం, రేడియో స్టేషన్, వై జంక్షన్, బళ్లారి చౌరస్తా, కొత్త బస్టాండ్, రాజ్ విహార్, మెడికల్ కళాశాల మీదుగా కలెక్టరేట్ వరకు సాగింది. ఈ పాదయాత్రలో వివిధ కార్మిక, విద్యార్థి, యువజన, మహిళా, మైనారిటీ, సామాజిక సంఘాలు, సీపీఐ ఆధ్వర్యంలోనూ అడుగ డుగునా పూలమాలలేసి సంఘీభావం తెలుపుతూ ఘనంగా స్వాగతం పలికారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ ముందు ఏర్పాటు చేసిన మహా ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న రాఘవులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కర్నూలు జిల్లా అత్యంత వెనుకబడిన ప్రాంతమన్నారు. ఆర్థిక మంత్రి ఈ ప్రాంతానికి చెందిన వ్యక్తి. ఆయన ఏదో పొడి చేస్తాడనుకుంటే..ఏకంగా జిల్లాకు మొండి చేయి చూపాడన్నారు. ప్రజలకు బాధ్యతాయుతంగా సేవ చేయలేని ఎమ్మెల్యేలు, మంత్రులు.. రాజీనామా చేసి, ఇంట్లో కూర్చోవాలన్నారు. ఇప్పటికైనా సమస్యలపై దృష్టి సారించకపోతే ప్రజా ప్రతినిధులకు శంకరగిరి మాన్యాలు తప్పవన్నారు. మహాధర్నా కార్యక్రమంలో జిల్లా నాయకులు రామాంజనేయులు, అంజిబాబు, నాగేశ్వరరావు, లింగన్న, లక్ష్మన్న, వీరశేఖర్, హనుమంతు, అబ్దుల్లా పాల్గొన్నారు.

అవినీతి అధికారులపై ఫిర్యాదుకు 14400 కాల్ చేయండి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అవినీతి అధికారులపై ప్రజల ఫిర్యాదు కోసం 14400 టోల్ ఫ్రీ నంబరుకు కాల్ చేయాలని, దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి సూచించారు. అధికారులు వేధింపులకు పాల్పడితే ప్రజలు ఈ నంబర్ ద్వారా అవినీతి నిరోధక శాఖ అధికారులను సంప్రదించ వచ్చని సోమవారం డీజీపీ కార్యా లయం ఒక ప్రకటన విడుదల చేసింది. డీజీపీ ఆదేశాల మేరకు ఏసీబీ 14400 కాల్ సెంటర్ ద్వారా అవినీతి అధికారిపై వచ్చిన ఫిర్యాదులతో ఎన్టీఆర్ జిల్లా, ఇబ్రహీంపట్నం ఏపీసీపీడీసీఎల్ కార్యాలయంపై ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించినట్లు డీజీపీ తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా, విజయవాడకు చెందిన బాధితుడు ప్రవీణ్ కుమార్ కొత్త ఇంటికి 3 ఫేస్ విద్యుత్ కనెక్షన్ కోసం ఇబ్ర హీంపట్నం ఏపీసీపీడీసీఎల్ ఏఈ బి.శ్రీనివాస రావును కలవగా, రూ.50వేల లంచంగా డిమాండ్ చేయడంతో, ఫిర్యాదిదారుడు ఏసీబీ అధికారుల్ని ఆశ్రయించినట్లు పేర్కొన్నారు.

కాంగ్రెస్‌తోనే మహిళాభ్యుదయం

పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కాంగ్రెస్ పార్టీతోనే మహిళా భ్యుదయం సాకారమవుతుందని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు స్పష్టం చేశారు. రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా నూతనంగా ఎన్నికైన లాం తాంతియా కుమారి ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం విజయవాడలోని ఆంధ్రరత్నభవన్‌లో జరిగింది. సభకు అధ్యక్షత వహించిన గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ చట్టసభల్లో మహిళలకు సముచిత స్థానం కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. ఎంతో రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబానికి చెందిన తాంతియాతో కాంగ్రెస్, మహిళా విభాగం మరింత బలోపేతం అవుతుందని ఆశాభవం వ్యక్తం చేశారు. చట్ట సభల్లో 33 శాతం స్థానాలను మహిళకు కేటాయించడంలో కాంగ్రెస్ పార్టీ ముందు ఉంటుందన్నారు. పార్టీలోని ప్రధాన విభాగాలన్నీ మహిళా అధ్యక్షురాలికి అండగా ఉంటాయని ఆయన హామీ ఇచ్చారు.

మహిళలకు రక్షణ లేదు: తాంతియా కుమారి

రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఏపీ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలిగా నియమితులైన తాంతియా కుమారి అన్నారు. ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో మహిళలపై ఎన్నో ఘోరాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆక్రోశం వెలిబుచ్చారు. తనకు అత్యున్నత పదవి ఇచ్చిన పీసీసీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మహిళా జాతీయ ఆధ్యక్షురాలు నెట్టా సౌజా, కాంగ్రెస్ మీడియా సెల్ చైర్మన్ తులసిరెడ్డి, మహిళా విభాగం రాష్ట్ర బాధ్యురాలు హసీనా, ఏఐసీసీ కార్యదర్శి ఉష నాయుడు, కార్యనిర్వాహక అధ్యక్షులు మస్తాన్ వలీ, జంగా గౌతమ్, కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే సత్యవతి, ఏఐసీసీ సభ్యులు మేడా సురేష్, మీసాల రాజేశ్వరరావు, రాష్ట్ర లీగల్ సెల్ చైర్మన్ వి.గుర్నాథం, వైస్ చైర్మన్ డాక్టర్ జంధ్యాల శాస్త్రి, విజయవాడ నగర్ కాంగ్రెస్ అధ్యక్షులు నరహరిశెట్టి నరసింహారావు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు బొర్రా కిరణ్, కాంగ్రెస్ నేతలు యలమందారెడ్డి, శ్రీపతి ప్రకాష్, ధనేకుల మురళి, మండవ రాజశేఖర్, లక్ష్మీ, పీవై కిరణ్, సతీష్, బైపూడి నాగేశ్వరరావు సహా పలువురు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులపై నిర్లక్ష్యం

15 లోగా పరిష్కారం చేయాల్సిందే: జగదీశ్, తిరుపతిరావు

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: పదేళ్లుగా అగ్రిగోల్డ్ బాధితులను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్, ఏపీ అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సహాయ కార్యదర్శి నారాయణస్వామి విమర్శించారు. నీలం రాజశేఖరరెడ్డి భవన్‌లో అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర సమితి అధ్వర్యంలో రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల ప్రతినిధులు, అనంతపురం జిల్లా, కర్నాటక బాధితులు సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. అసోసియేషన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సిద్దేశ్వర్ అధ్యక్షత వహించారు. జగదీశ్ మాట్లాడుతూ న్యాయం కోసం అగ్రిగోల్డ్ బాధితులు పదేళ్లుగా పోరాటం చేస్తున్నారని, అయినా నాడు టీడీపీ, నేడు వైసీపీ ప్రభుత్వాల్లో కదలిక రాలేదని విమర్శించారు. అగ్రిగోల్డ్ సంస్థలో డిపాజిట్లు చేసిన వారంతా పేద, మధ్యతరగతి కుటుంబాలేనని చెప్పారు. అగ్రిగోల్డ్ ఏజెంట్లు, బాధితుల సమస్యలు పరిష్కరిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన వైఎస్ జగన్...అధికారం చేపట్టిన తర్వాత పట్టించుకోలేదని ఆరోపించారు. అగ్రిగోల్డ్ బాధితుల సమస్యల పరిష్కారంపై వైసీపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి కనిపించడం లేదని విరుచుకుపడ్డారు. అగ్రిగోల్డ్ సంస్థ దివాలాతో ఏజెంట్లు, ఖాతాదారులు అనేకమంది ఆత్మహత్యలు చేసుకున్నారని, బాధిత కుటుంబాలకు కనీసం నష్టపరిహారం ఇవ్వలేదని మండిపడ్డారు. చివరి దశలోనైనా బటన్ నొక్కి అగ్రిగోల్డ్ బాధితుల ఖాతాల్లో సొమ్ము జమ చేయాలని జగదీశ్ డిమాండ్ చేశారు. తిరుపతిరావు మాట్లాడుతూ ఆగస్టు 15 లోగా అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలు పరిష్కరించాలని, లేకపోతే 30న లక్షల మంది బాధితులతో అమరావతిలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని, అవసరమైతే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. ప్రతిపక్ష నేతగా జగన్ అగ్రిగోల్డ్ బాధితుల దీక్షా శిబిరాలకు వచ్చి...అధికారం చేపట్టిన ఆరు మాసాల్లో న్యాయం చేస్తానని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. నాలుగున్నరేళ్లు అయినా అరకొర సాయం తప్ప బాధితులను ఆదుకోలేదని ఆరోపించారు. ప్రభుత్వ ఆధీనంలో గల అగ్రిగోల్డ్ ఆస్తులు విక్రయించైనా బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గేయానంద్ మాట్లాడుతూ తాను ఎమ్మెల్సీగా శాసనమండలిలో అనేకమార్లు అగ్రిగోల్డ్ బాధితుల సమస్యను చర్చకు తీసుకొచ్చానన్నారు. మూడు వేల కోట్ల రూపాయలు ఇస్తే బాధితులకు న్యాయం జరుగుతుందన్నారు. అగ్రిగోల్డ్ బాధితుల సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణప్ప, ప్రధాన కార్యదర్శి కుల్లాయప్ప, నాయకులు ఎర్రిస్వామి, ధనుంజయ, మహబూబ్ బాష, షబ్బీర్ ఖాన్, ఓబులపతి, తిమ్మరాజు, ఆదినారాయణ, శ్రీనివాసులు, వెంకటేశులు, జయమ్మ, శ్రీవాణి, ఇందిరమ్మ, గౌరి, కృష్ణవేణి, లక్ష్మినరసమ్మ, రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

భారీగా గంజాయి పట్టివేత: 8 మంది అరెస్ట్

విశాలాంధ్ర-చింతపల్లి/జీకే వీధి: ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతం నుంచి గంజాయిని తరలిస్తున్న ముఠా గుట్టురట్టయింది. ఎనిమిది మందిని అరెస్టు చేసిన పోలీసులు... 255 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జీకే విధి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అశోక్ కుమార్ సోమవారం మీడియాకు వివరాలు వెల్లడించారు. ముందస్తు సమాచారం మేరకు జీకే వీధి ఎస్ఐ అప్పలసూరి తన సిబ్బందితో కలిసి పాత వీధిలో విస్తృతంగా వాహనాల తనిఖీ చేపట్టడంతో గంజాయి తరలిస్తున్న ముఠా పట్టుబడ్డారు. ఈ కేసుకు సంబంధించి నిందితులంతా చింతపల్లి మండలం పెంట్లి మామిడి, చవటపాడు, రౌరింతాడ గ్రామస్తులుగా గుర్తించారు. వీరంతా వ్యసనాలకు బానిసలై, అక్రమ సంపాదనకు అలవాటు పడి గంజాయి స్మగ్లర్లతో చేతులు కలిపారు. వీరంతా (పెంట్లి మామిడి గ్రామానికి చెందిన గెమ్మెలి యువరాజు, గెమ్మెలి కిరణ్, వంతల ఉదయ్, పాంగి సుఖదేవ్, రౌ రింతాడ గ్రామానికి చెందిన కొర్రా రమేశ్, కొర్రా బుజ్జి బాబు, కొర్రా సందీప్ ప్రవీణ్, చవటపాడు గ్రామానికి చెందిన బూర్ల అప్పల స్వామి) కర్నాటక రాష్ట్రానికి చెందిన మారప్పతో కలిసి దందా సాగిస్తూ అడ్డంగా దొరికిపోయారని తెలిపారు. ఒడిశా, చిత్రకొండ బ్లాక్ లోని చీడిపాకలు గ్రామం లో గంజాయిని కొనుగోలు చేసి, అక్కడ నుండి గంజాయిని పడవలో తెచ్చి సీలేరు నదిని దాటించి కాట్రగెడ్డ ఒడ్డుకి తీసుకొచ్చి, ఆంధ్ర బోర్డర్ కి చేర్చేవారు. అక్కడ నుండి మారప్ప... కొర్ర రమేష్, కొర్ర అప్పారావు వారి ముఠా సహాయంతో గంజాయిని ఆటోలలో విశాఖకు చెందిన తేజమూర్తుల వెంకటేష్ ఏ బంటు అను వ్యక్తి ద్వారా కార్లు బుక్ చేసుకుని గంజాయిని తన రాష్ట్రానికి తీసుకుని వెళ్లేవాడన్నారు. ఆ క్రమంలో వారం క్రితం మారప్ప రౌరింతాడ గ్రామం వెళ్లి కొర్రా రమేష్ ను కలసి గంజాయిని మోత ద్వారా తరలించే రాయిపాలెం గ్రామానికి చెందిన కొర్రా నూకరాజును పిలిపించుకొని అతనికి రూ.50 వేలు ఇచ్చాడు. మోతకి మనుసులను సిద్ధం చేయమని చెప్పాడు. గంజాయి కొనడం కోసం కొర్ర రమేష్ కొర్రా సందీప్ ఏ ప్రవీణ్, కొర్రా బుజ్జిబాబు... మారప్ప తో పాటు ఒడిశాలోని చిత్రకొండ బ్లాక్ చీడిపాకలు గ్రామం వెళ్లి అక్కడ 255 కేజీ ల గంజాయిని కేజీ 1800 రూపాయలు చొప్పున రూ.4,78,800/- చెల్లించి కొనుగోలు చేశారు. ఈ నెల 5 న మారప్ప ఫోన్ చేయగా కొర్రా రమేష్, అప్పారావు లు ఆ గంజాయిని తరలించడానికి పెంట్లిమామిడికి చెందిన గెమ్మెళ యువరాజు ఆటో, మరొకటి చింతపల్లి మండలం, పుల్లమామిడి లంక గ్రామానికి చెందిన గెమ్మెళ రాము ఆటోను అద్దెకు తీసుకున్నారు. వాటిలో గోనె సంచుల్లో నింపిన గంజాయిని ఉంచి తరలిస్తుండగా... ఆదివారం మధ్యాహ్నం కాట్రగెడ్డ వద్ద బయలు దేరారు. పోలీస్ చెక్ పోస్ట్ లు తప్పించుకోటానికి నడకమార్గంలో తాజంగి దగ్గర కొండ ప్రాంతానికి వస్తుండగా పాతవీధి వద్ద నిందితులను అదుపులోకి తీసుకుని 12 తెల్లని గోనె సంచుల్లో నింపిన 255 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. రెండు ఆటోలు, రెండు ద్విచక్రవాహనాలు, 4 సెల్ ఫోన్లు, నగదు రూ.104000 లను సీజ్ చేసినట్లు వెల్లడించారు.

సంపాదకీయం

ఇన్ని మెట్లూ ఎక్కాలా!

రాహుల్ గాంధీ కథ ప్రస్తుతానికి సుఖాంతం అయి ఉండవచ్చు. పరువునష్టం కేసులో గుజరాత్‌లోని కింది కోర్టు ఆయనకు విధించిన రెండేళ్ల శిక్ష అమలును సుప్రీంకోర్టు నిలిపివేసింది. 2019 ఏప్రిల్ 13న కర్నాటకలోని కోలార్‌లో మోదీ ఇంటిపేరున్నవారు అందరూ దొంగలే ఎందుకు ఉంటారు అని ఓ ఎన్నికల ప్రచారసభలో మాట్లాడుతూ వ్యాఖ్యానించిందుకు గుజరాత్‌లోని సూరత్‌లో ఉన్న కోర్టు 2023 మార్చి 23న రాహుల్‌కు రెండేళ్ల జైలుశిక్ష విధించింది. నేరపూరితమైన పరువునష్టం కేసులో రెండేళ్ల దాకా శిక్ష విధించవచ్చునని ఉన్న నిబంధనను వినియోగించి సూరత్‌లోని కింది కోర్టు న్యాయాధికారి రాహుల్‌కు రెండేళ్ల శిక్ష విధించారు. అవకాశం ఉన్నంతమేర శిక్ష విధించడం చాలా అసాధారణమైంది. బహుశా ఇలా మరో దృష్టాంతం కనిపించడం లేదు. ఈ శిక్ష విధించిన మర్నాడే లోకసభ సచివాలయం ఆయన పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దుచేసింది. ఏంపీగా ఆయనకు కేటాయించిన ఇల్లు కూడా ఖాళీ చేయించారు. ఆయనపై కోర్టుకు అప్పీలు చేసుకోవడానికి వీలుగా 30 రోజుల పాటు శిక్ష అమలు చేయకుండా వెసులుబాటు కూడా కల్పించారు. రూ.15,000 పూచీకత్తుపై ఆయనకు బెయిలు కూడా మంజూరు చేశారు. 2023 ఏప్రిల్ మూడున రాహుల్ గాంధీ సూరత్‌లోని సెషన్స్ కోర్టులో కింది కోర్టు న్యాయమూర్తి ఇచ్చిన తీర్పును సవాలు చేశారు. 2023 ఏప్రిల్ 20న సెషన్స్ కోర్టు రాహుల్ అర్జీని తోసిపుచ్చింది. ఆ తరవాత అయిదు రోజులకు రాహుల్ గుజరాత్ హైకోర్టును ఆశ్రయిస్తే అక్కడ కూడా 2023 జులై ఏడున చుక్కెదురైంది. గుజరాత్ హైకోర్టు శిక్ష నిల్పి వేయడానికి నిరాకరించిన వారం రోజులకు రాహుల్ హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టులో అప్పీలు చేసుకున్నారు. జులై 21వ తేదీన సుప్రీంకోర్టు గుజరాత్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. మామూలుగా పరువునష్టం కేసుల్లో క్షమాపణచెప్తే శిక్ష విధించరు. కానీ తాను తప్పు చేయలేదు కనక క్షమాపణ చెప్పే ప్రసక్తేలేదని తేల్చి చెప్పారు. క్షమాపణ చెప్పేటట్టయితే ఆ పని ఎప్పుడో చేసేవాడినని రాహుల్ చెప్పారు. 2023 ఆగస్టు నాలుగున సుప్రీంకోర్టు రాహుల్‌కు విధించిన శిక్ష అమలుపై స్టే మంజూరుచేసింది. ఈ తీర్పు చెప్పింది శుక్రవారం రోజున. శని, ఆది వారాలు లోకసభ సచివాలయం పనిచేయదు. అందుకని మూడు రోజులకు రాహుల్ లోకసభ సభ్యత్వాన్ని పునరుద్ధరించారు. కింది కోర్టుతీర్పు చెప్పిన మరుసటిరోజే లోకసభ సభ్యత్వం రద్దు చేయడానికి ఉత్సాహం ప్రదర్శించిన లోకసభ సచివాలయం ఆ సభ్యత్వం పునరుద్ధరించడానికి రెండురోజులు విరామం వచ్చే సరికి కక్షగట్టినట్టు వ్యవహరిస్తున్న మోదీ ప్రభుత్వం మరింత జాప్యం చేస్తుందేమోనన్న ఊహాగానాలు చెలరేగాయి. రాహుల్‌ను జైలుకు పంపిస్తే ఏ జరుగుతుందో మోదీ సర్కారుకు తెలుసు. భారత్ జోడో యాత్ర తరవాత రాహుల్ నడవడికలో పెద్ద పరిణామాత్మకమైన మార్పు కనిపించింది. ఆయన ప్రతిష్ఠ పెరగడం మొదలైంది. మరో ఎనిమిది నెలల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న సమయంలో ఆయన పలుకుబడి మరింత పెరుగుతుందని అది తమకు ప్రమాదకరమని గ్రహించలేనంతటి అమాయకత్వం మోదీ ప్రభుత్వానికి లేకపోలేదు. అందుకే సోమవారం రాహుల్ లోకసభ సభ్యత్వం పునరుద్ధరించారు.

కింది కోర్టు రాహుల్‌కు శిక్ష విధించడమే విచిత్రమైన రీతిలో జరిగింది. రాహుల్ మీద ఇలాంటి కేసులు మరో పదిదాకా ఉన్నాయని, ప్రజా ప్రతినిధులుగా ఉన్న వారు జాగ్రత్తగా మాట్లాడాలని కూడా కింది కోర్టు వ్యాఖ్యానించడం వివాదాస్పదమైంది. కింది కోర్టు న్యాయమూర్తి అలా ఎందుకు చేశారు అంటే రాహుల్‌ను ఇంతకు ముందు సుప్రీంకోర్టు కూడా మందలించింది కదా అని సమర్థించుకున్నారు. కానీ రాహుల్ ను అత్యున్నత న్యాయస్థానం మందలించడానికి ఈ కేసు విచారణ తరవాత జరిగింది. శిక్ష అమలు మీద సుప్రీంకోర్టు స్టే విధించకుండా ఉంటే రెండేళ్ల శిక్ష అనుభవించిన తరవాత మరో ఆరేళ్లపాటు రాహుల్ ఎన్నికలలో పోటీ చేయడానికి వీలుండేది కాదు. ఆ విషమ పరిస్థితి తప్పింది. సుప్రీంకోర్టు స్టే విధించడంతో పాటు కింది కోర్టు వ్యవహార సరళిని ప్రశ్నించింది. దీన్నిబట్టి కింది కోర్టులు కొన్ని సందర్భాలలో కడకు హైకోర్టుల నిర్ణయాలు కూడా నిర్హేతుకంగా ఉంటున్నాయి. ముఖ్యంగా గుజరాత్‌లోని కోర్టుల తీర్పులు ప్రశ్నార్థకం అవుతున్నాయి. అంటే అక్కడి కోర్టులను ఏ శక్తి ప్రభావితం చేస్తోంది అన్న ప్రశ్న తలెత్తకపోదు. లేకపోతే కొందరు న్యాయమూర్తులు కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి అనుకూలంగా పనిచేస్తున్నారేమో అన్న అనుమానానికీ ఆస్కారంఉంది. సహజంగానే కాంగ్రెస్ వర్గాలు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును చూసి ఆనందపడ్తున్నారు. మంగళవారం నుంచి ప్రతిపక్ష ఫ్రంట్ "ఇండియా" మోదీ ప్రభుత్వంపై ప్రతిపాదించిన తీర్పుపై చర్చ మొదలు కాబోతోంది. ఈ చర్చలో రాహుల్ పాల్గొంటారనే అనుకోవాలి. ఆయన సీనియర్ నాయకుడు కనక ఇదివరకటి లాగానే మోదీ ప్రభుత్వాన్ని నిలదీస్తారని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు.

అవిశ్వాస తీర్మానంపై మాట్లాడేటప్పుడు రాహుల్ మణిపూర్ పరిణామాలను కూడా తప్పకుండా ప్రస్తావించవచ్చు. అదానీ వ్యవహారంలో రాహుల్ లోకసభలో నిక్కచ్చిగా నిలదీయడాన్ని మోదీ సర్కారుకు మింగుడు పడలేదు. అందుకే ఆయన లోకసభ సభ్యత్వం రద్దయ్యేట్టు చేశారన్న విమర్శలూ వచ్చాయి. విద్వేష పూరిత విధానాలు అనుసరించడమే కాకుండా ముందు కాంగ్రెస్ మీదే దాడికి దిగిన మోదీ ఇప్పుడు "ఇండియా" ఫ్రంట్ మీదే విరుచుకు పడ్తున్నారు. ఈ దాడికి సమయమూ, సందర్భమూ కూడా ఉండడం లేదు. అధికారిక కార్యక్రమాలలోనూ మోదీ రాజకీయ విమర్శలే గుప్పిస్తున్నారు. ప్రతిపక్షాల ఐక్యత సార్వత్రిక ఎన్నికలలోనూ కొనసాగితే తమకు ముప్పు పొంచిఉందనే భయం మోదీని, బీజేపీని పీడిస్తోంది. అందుకని ప్రతిపక్ష ఫ్రంట్ లోని పార్టీలు అవినీతిపూరిత మైనవని, వంశపారం పర్యపాలన కొనసాగించాలనుకునేవనీ మోదీ అంటున్నారు. తనలో గూడుకట్టుకున్న భయాన్ని మోదీ తిట్లు, శాపనార్థాలతో పూరించుకుంటున్నారు. మొత్తం ప్రతిపక్షాలంటేనే మోదీకి ససేమిరా గిట్టడంలేదు.

ఈ రాజకీయ పరిణామాలను అలా ఉంచినా పరువునష్టం లాంటి వ్యవహారాలలో నేరపూరితమైన పార్శ్వాన్ని తొలగించకపోవడం, మోదీ అన్న ఇంటిపేర్ల మీద రాహుల్ వ్యాఖ్యలపై ఇంత దుమారం రేగడం ప్రజాస్వామ్యాన్ని బలహీన పరిచే పరిణామాలే. అదీగాక ఒక కేసులో న్యాయవ్యవస్థలోని అన్ని మెట్లు ఎక్కడం సామాన్యులవల్ల అయ్యే పనికాదు. న్యాయంకోసం సాధారణ ప్రజలు సుప్రీంకోర్టు దాకా అన్ని మెట్లెక్కడం కుదిరే పని కాదు. పరువునష్టం కేసులు సాధారణంగా వీగిపోతాయి. కానీ వాటి వెనక రాజకీయాలు ఉన్నప్పుడు రచ్చ కాక తప్పదు. పరువునష్టం వ్యవహారాలను నేరం కింద పరిగణించకపోవడం ఒక్కటే మార్గం. అనేక దేశాల్లో ఇప్పటికే ఆ పని చేశారు.

బిగ్ బజార్

చింతపట్ల సుదర్శన్

రాత్రి తిన్నది అరగటానికి మనుషుల్లాగే మార్నింగ్ వాక్‌కి బయలు దేరింది డాగీ. పార్కులో గుండ్రటి పొట్టలు ఉన్నవాళ్లు గుండ్రాలు తిరుగు తున్నారు. కాంపౌండు గోడ పక్కనుంచి వెళ్తుంటే కనపడింది జడ్జి పెంపుడు కుక్క మోతీ. హాయ్ మోతీ హౌ అర్ యూ అంది డాగీ తమ భాషలో. ఏదో ఫరవాలేదు బానే ఉన్నా అంది మోతీ నీరసంగా. 'డల్ గా' కనపడ్తున్నావు అంది డాగీ. ఏం చెప్పమంటావు పెట్ డాగ్‌ల కష్టాలు పెట్‌డాగ్‌లవే. అంటే జడ్జి గృహ బహిష్కరణ శిక్ష విధించారా. నీ వెంట వచ్చే మనిషేడీ? లోపల పార్కులో మొబైల్ చాటింగ్‌లో బిజీగా ఉన్నాడు. నేనింకా జడ్జి పెట్‌నే, అయితేనేం కష్టాలు మనుషులకే కాదు మనలాంటి కుక్కలకూ వస్తాయి అంది మోతీ నిట్టూరిస్తూ. దగ్గరికి వెళ్లి తన తలతో మోతీ తలనితాకుతూ నీకూ కష్టంవచ్చిందా? ఏమిటో అంది అనునయిస్తూ డాగీ. నేనిప్పుడు 'ప్రెగ్నెంట్'ని అంది మోతీ. అవునా తల్లినవుతున్నావు ఇది మంచి విషయమే కదా. ఎలా అవుతుంది. నాకెవరన్నా సంతానలక్ష్మి పథకం అమలుచేస్తారా? అసలు సంగతేమిటంటే నేను ప్రసవించగానే నా పిల్లల్ని అమ్మేయాలని చూస్తున్నాడు 'నా కేర్‌టేకర్'. ఆ చింతేనన్ను ఎప్పుడూ చింతించేట్టు

చేస్తున్నది. నా పిల్లలకి పాలిచ్చి పెంచుకోగలనా, లాలించి ఆడించగలనా అన్న టెన్షన్‌తో అన్నం సహించడంలేదు. అసలు నీ పిల్లల్ని పుట్టగానే అమ్మేస్తారని ఎవరన్నారు. జడ్జికి తెలుసా? తెలుసు ఆయనకీ తెల్సు. ఈ మధ్య వయసు పెరిగింది. పెట్‌డాగ్స్‌తో ఆడుకునే ఓపికా తగ్గింది. నాకు పిల్లలుపుడితే వాటి సంరక్షణ కూడా భారమవుతుందని, మంచి గిరాకీలు ఉన్నాయని, పిల్లలు పుట్టగానే అమ్మేద్దామని అయనతో మా కేర్ టేకర్ చెబుతుంటే విన్నా. ఆయన సరే నన్నట్లు తలఊపడం కూడా చూశా అంది మోతీ. నిజంగా కుక్కపిల్లల్ని కూడా అమ్ముకుంటారా? ఎందుకమ్మరు జాతి కుక్కపిల్లలకు ఖరీదెక్కువ. పాతిక, యాభైవేలదాకా ఇచ్చికొంటారు. బాబోయి అంతఖరీదా? మీరంటే జాతికుక్కలు కనుక మాలాంటి ఊర కుక్కలకు ఖరీదుకట్టే షరాబుఎవ్వడు అని డాగీ అంటుంటే చేతిలో బెత్తం పట్టుకుని మోతీ కేర్‌టేకర్ వచ్చాడు. వాడ్నిచూస్తూనే మోతీ మీబాస్ వచ్చేశాడు మళ్లీ కలుద్దాం 'బైబై' అంటూ తమ కూలిన కొంపవైపు పరుగు తీసింది డాగీ.

సాయంత్రం అరుగెక్కిన డాగీతో ఏంటి బ్రో ఇవ్వాళ 'అర్లీ'గా వచ్చి నట్టున్నావు అంది డాంకీ. ఏం చెప్పను 'బ్రో' మనసు బాలేదు. తిండి కూడా సయించలేదు అంది డాగీ తన జాగాలో కూలబడుతూ. అదేంటోయ్ పాత పార్టీ టిక్కెట్లు దొరక్క, కొత్తపార్టీలో చోటు దొరక్క దిగాలుపడ్డ లీడర్‌లా ముఖం పెట్టావు అంది డాంకీ. ఎహె నీకు ఎప్పుడూ పార్టీల గోలే 'బ్రో' అదికాదు మోతీ పాపం విచారంగా ఉండడం చూసి నాకూ బాధ కలిగింది. ఆ ఆలోచనవల్లే ఈ రోజంతా దిగులుగా గడిచింది. మోతీ విచారంగా ఉండటం దేనికి అసలు పాయింటేమిటి? మోతీ త్వరలో పిల్లల్ని కనబోతున్న దట, మంచిదే కద తల్లి అనేదే లేకపోతే ఈ లోకమే శూన్యం కద. సంతానమే లేక స్వర్గమేలేదని అన్నారు కద. మోతీయే కాదు మనుషుల్లో సహా సర్వజీవాలూ తల్లి కారణంగానే కదా లోకానికి వస్తయి అంది డాంకీ. నువ్వు ఏ విషయంలోనైనా లోతుగా దూకుతావు. అది సరేకాని మోతీకి పుట్టే పిల్లల్ని అమ్మేస్తారట బోలెడుడబ్బు వస్తుందట. డబ్బుకోసం మనుషులు ఏ గడ్డయినా మేస్తారులే అది వారి సహజ లక్షణం, కుక్క పిల్లల్ని, పసికూనల్ని అమ్ముకోవడం తప్పుకాదా అంది డాగీ. తల్లినీ పిల్లల్నీ వేరు చేయడం తప్పేకావచ్చు కానీ 'పవర్' విషయంలో 'మనీ పవర్' విషయంలో తప్పుఒప్పులు ఆలోచించరు. మానం, అభిమానం, సిగ్గూ, లజ్జా, నీతి, జాతివంటి పదాలను పట్టించుకోరు మనుషులు. రైతు బజారు ముందుకు వెళ్లి చూడు ప్రాణం ఉన్నవాటినన్నిటినీ తూకంవేసి అమ్ముతారు. కోళ్లు, గొర్రెలు, చేపలు ఈ లోకంలో తమకు లొంగిన, లోకువైన ఏ ప్రాణినైనా సరే అమ్ముకుని సొమ్ము చేసుకుంటారు. ఇది పాపం కాదా? ఇది నేరం కాదా? అంది డాగీ కోపంగా తోక పైకి నిలబెట్టి. పిచ్చి డాగీ పెద్దపెద్ద నేరాలు చేసినవాళ్లనే నెలలకొద్దీ విచారణ జరిపి తడిసిన దీపావళి బాంబులా 'తుస్సు' మనిపిస్తారు. పదిరూపాయల దొంగతనం చేసినోణ్ణి జైల్లో పెడతారు. పదికోట్లు దొంగతనం చేసినోణ్ణి దొరను చేస్తారు. ఈ మనుషులు నోరులేని ప్రాణుల్ని అమ్ముకోవడమేకాదు. తమను తాము కూడా అయినకాడికి అమ్మేసుకుంటారు. వీళ్ల కథల్లో ఒకడు తననీ, తమ్ముళ్లన్నీ, కట్టుకున్న భార్యనీ జూదంలో పెట్టాడు. ఒకడు తననీ, భార్య, కొడుకునే అమ్మేసుకున్నారు. అమ్ముకోవడం వీళ్లకి తరతరాలనుంచీ వస్తున్నదే పార్టీని అమ్మేవాడొకడయితే, వ్యక్తిత్వాన్ని అమ్ముకుని పార్టీ మార్చేవాడొకడు 'బి'ఫాంలు అమ్ముకునేవాడొకడైతే, కేబినెట్ ర్యాంకులమ్ము కునేవాడు ఒకడు. ఈ లోకమే ఒక పెద్ద 'బిగ్ బజార్' అంది డాంకీ.

బాగా చెప్పావు డాంకీ! అరుగుఎక్కుతూ అన్నాడబ్బాయి. 'ప్రజలక్షేమం కోరే నాయకుల్ని ఎన్నుకోవలసిన ప్రజలు తమ ఓట్లు అమ్ముకుని భవిష్యత్తు తరాలకు తీరని ద్రోహం చేస్తున్నారు. ప్రజాస్వామ్యాన్నే అమ్మకానికి పెట్టే మనుషులు కుక్క పిల్లల్ని అమ్ముకోవద్దు అంటే వింటారా అని చతికిలబడింది డాగీ.

విశాఖ ఉక్కుపై అదానీ పిడుగు

డాక్టర్ సీ.ఎన్. క్షేత్రపాల్‌రెడ్డి

విశాఖ ఉక్కు పరిశ్రమ పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యి చందంగా మారింది. అవసరమైన సొంత గనుల్ని కేటాయించకుండా... పరిశ్రమనే అమ్మేస్తామని ప్రకటించి కేంద్ర ప్రభుత్వం విశాఖఉక్కును పీకల్లోతు కష్టాల్లోకి చేర్చింది. ఇప్పటికే తీవ్రమైన నష్టాల ఊబిలోకి నెట్టిన పరిశ్రమపై అదానీ యాజమాన్యంలోకి చేరిన గంగవరం పోర్టు తీసుకుంటున్న నిర్ణయాల రూపంలో మరో పిడుగుపడింది.

స్టీలు ప్లాంటుకు సంబంధించిన భూముల్లోనే నిర్మాణమైన గంగవరం పోర్టు అదానీ చేతుల్లోకి చేరిన క్షణం నుంచి విశాఖ ఉక్కు పరిశ్రమ పాలిట శాపంగా మారింది. గంగవరం పోర్టులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఉన్న 10.54 శాతం వాటాను కూడా కేంద్ర పెద్దల సహకారంతో అదానీ కైవశం చేసుకోవడంతో పోర్టులో ఆయన ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది. గంగవరం పోర్టు పూర్తిగా అదానీ గుప్పిట్లోకి చేరుకున్న నాటినుంచి సరుకు రవాణా ఛార్జీలు విపరీతంగా పెరిగాయి. గంగవరం పోర్టుతో పాటు విశాఖ స్టీల్‌ను కూడా అప్పనంగా దక్కించుకోవాలని కలలు కన్న కార్పొరేట్ వర్గాలకు హిండెన్‌బర్గ్ నివేదిక గట్టి షాక్ ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే ఎలాగైనా ఉక్కు పరిశ్రమను దక్కించుకోవాలని భావించిన అదానీ సంస్థ తన ఆధీనంలో ఉన్న గంగవరం పోర్టును అడ్డుపెట్టుకుని కుట్రలకు తెరలేపింది. ఇందులో భాగంగానే గంగవరం పోర్టు నుంచి విశాఖ ఉక్కు కర్మాగారానికి అందాల్సిన ముడిసరుకు దిగుమతుల్ని అడ్డుకుంటోంది.

విశాఖ ఉక్కు పరిశ్రమకు నిత్యావసరమైన కోకింగ్ కోల్, డోలమైట్, లైమ్ స్టోన్ తదితర ముడిసరుకును విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి ఉంటుంది. ప్రధానంగా పరిశ్రమకు లక్షల టన్నుల్లో కోకింగ్ కోల్ అవసరం ఉంటోంది. దీన్ని ప్లాంటు యాజమాన్యం ఆస్ట్రేలియా, రష్యా, అమెరికా, గల్ఫ్ తదితర దేశాల నుంచి తెప్పించుకోకపోతే స్టీల్ ప్లాంటులో ఉక్కు ఉత్పత్తి సాధ్యంకాదు. ఈ పరిస్థితిని అదానీ అదునుగా తీసుకున్నారు. దాదాపు 15 రోజుల కిందట రష్యా, అమెరికా నుంచి 2.68 లక్షల టన్నుల కోకింగ్ కోల్‌ను స్టీల్‌ప్లాంటు యాజమాన్యం దిగుమతి చేసుకుంది. దీన్ని మోసుకొచ్చిన భారీ నౌకలు గంగవరం పోర్టు సమీపానికి చేరుకున్నాయి. అయితే స్టీలు ప్లాంటు యాజమాన్యం తమకు ఇప్పటికే రూ.50 కోట్లు బకాయి ఉందని పేర్కొంటూ వేలకోట్ల విలువైన కోకింగ్ కోల్‌ను గంగవరం పోర్టులో దించడానికి వీలులేదని అడ్డుకున్నది.

ప్రస్తుతం గంగవరం పోర్టు కార్య కలాపాలు సాగిస్తున్న భూములు విశాఖ స్టీలు ప్లాంటుకు సంబంధించినవే. స్టీలుప్లాంటు కోసం సేకరించిన భూమిలో 1,100ఎకరాలను గంగవరం పోర్టుకు ప్రభుత్వం అప్పగించింది. ఇప్పటికీ గంగవరం పోర్టుకు స్టీలు ప్లాంటే నీటినికూడా సరఫరాచేస్తోంది. ఇవన్నీమరచిన గంగవరంపోర్టు యాజమాన్యం స్టీలు ప్లాంటులో ఉత్పత్తి నిలచి పోవాలనే అదానీ అభిమతానికి తగ్గట్టు కుట్ర పన్నింది. ఇప్పటికే నష్టాల్లో ఉన్న ప్లాంటుకు అవసరమైన కోకింగ్ కోల్ చేరకుండా మోకాలడ్డుతున్న అదానీ తీరు మూలిగే నక్కపై తాటి కాయ పడ్డ చందాన మారింది. కోకింగ్ కోల్ ఓడల్లోనే ఉండిపోవడంతో భారీ ఓడలకు రోజుకు రూ.36లక్షలు, చిన్న ఓడలకు రూ.12లక్షలు స్టీల్‌ప్లాంటు యాజమాన్యం చెల్లించాల్సి వస్తోంది. ఇది మరింత ఆర్థికభారంగా మారుతోంది.

నిజానికి పోర్టు అదానీ చేతుల్లోకి చేరకముందు పోర్టులోని ఒక బెర్తును కేవలం స్టీలుప్లాంటు ఉత్పత్తులు ఎగుమతి, దిగుమతి అవసరాలకే కేటాయించారు. ప్లాంటుకు సంబంధించిన ముడిసరుకుతో ఎప్పుడు ఓడలు వచ్చినా తక్షణం దింపేసి ప్రత్యేకంగా కేటాయించిన స్థలంలో నిల్వచేసేవారు. అక్కడి నుంచి కన్వేయర్ బెల్టుల ద్వారా స్టీలు ప్లాంటుకు తరలించుకునే అవకాశం ఉండేది. కానీ పోర్టు యాజమాన్యం అదానీ చేతుల్లోకి చేరిన మరుక్షణం స్టీలుప్లాంటు కోసం కేటాయించిన ప్రత్యేకమైన బెర్తుకు ఎసరు పెట్టేశారు. దిగుమతి అయిన ముడిసరుకు కోసం కేటాయించిన స్థలంలో ఇతరుల సరుకుల్ని నిల్వచేయడం మొదలు పెట్టారు. అక్కడితో ఆగకుండా వచ్చిన ముడిసరుకు విశాఖ ఉక్కుకర్మాగారానికి చేరకుండా అడ్డుకుంటున్నారు. కన్వేయర్ బెల్టు ద్వారా టన్ను ముడి సరుకును స్టీలు ప్లాంటుకు చేర్చడానికి తీసుకుంటున్న రూ.270కు అదనంగా రూ.55 పెంచి మరీ వసూలుచేసింది. ప్రస్తుతం దాన్ని కూడా నిలిపివేసినట్టు తెలుస్తోంది. కన్వేయర్ బెల్టు రిపేరులో ఉందనే పేరుతో రవాణాను అడ్డుకుంటున్నట్టు తెలుస్తోంది. ఈ తతంగం అంతా విశాఖ స్టీలుప్లాంటును పూర్తిగా దెబ్బతీయడానికేననే విషయం ఎవ్వరికైనా ఇట్టే అర్థమవుతుంది.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాల కారణంగా గత రెండున్నరేళ్లలో ప్లాంటులో 40శాతం ఉత్పత్తి తగ్గింది. ఫలితంగా ఏడాదికి రూ.3,900 కోట్లు ప్లాంటుకు నష్టాలు వచ్చాయి. తాజాగా అదానీ చేతుల్లో చేరిన పోర్టును అడ్డుపెట్టుకుని ముడి సరుకు ప్లాంటుకు చేరకుండా అడ్డుకోవడం ద్వారా మరిన్ని నష్టాలు వచ్చేలా చేయాలనే అదానీ ప్లాన్‌కు కేంద్ర ప్రభుత్వం అండగా ఉంది. గంగవరంలోని రాష్ట్ర ప్రభుత్వ వాటాను అదానీకి అమ్మేయడంతో పాటు ఆయన అనుంగు శిష్యుడైన పరిమళ్ నత్వానికి రాజ్యసభ సభ్యత్వం కట్టబెట్టిన వైసీపీ ప్రభుత్వానికి సదరు కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి సమస్యను పరిష్కరించడం చాలా సులభమే. కానీ జగన్ ప్రభుత్వం అందుకు సిద్ధపడడం లేదు. రాష్ట్రంలో ఉన్న ఏకైక భారీ పరిశ్రమ దెబ్బతింటున్నా చోద్యం చూస్తుండడం అదానీకి పరోక్షంగా జగన్ ప్రభుత్వం సహకరిస్తోందనే విమర్శలకు బలం చేకూరుతోంది.

ఒకవైపు స్టీలు ప్లాంటును దొంగదెబ్బ తీస్తోన్న అదానీ మరోవైపు పోర్టులో పనిచేస్తోన్న కాంట్రాక్టు కార్మికులపై వేధింపులకు పూనుకున్నది. కనీస వేతనం ఇవ్వకుండా వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారు. అన్యాయంపై ప్రశ్నించిన గొంతుల్ని యాజమాన్యం నొక్కేస్తోంది. ఈ క్రమంలో కొందరిని ఉద్యోగాల్లోంచి తొలగించింది. పోర్టు యాజమాన్య నిరంకుశ వైఖరిపై ఆగ్రహించిన కార్మికులు నెలరోజులుగా అదానీకి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నారు. దీన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదు. తమ భూముల్లోనే నిర్మాణమైన పోర్టులో తమనే నిర్వాసితులుగా మార్చిన వైనంపై కార్మికులు తీవ్ర ఆగ్రహంగా ఉన్నారు. ఇప్పటికే స్టీలు ప్లాంటు ఉద్యోగులతో కలసి 'మోదీ దిగిపో-క్విట్ అదానీ' అంటూ భారీ అందోళనలు నిర్వహిస్తున్నారు. అదానీకి కొమ్ముకాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధమైన కార్మిక వర్గానికి అండగా నిలవాల్సిన బాధ్యత పౌర సమాజంపై ఉంది.

సెల్: 9059837847

కృత్రిమ మేధతో ఉద్యోగాలకు ఎసరు..!

జ్ఞాన్ పాఠక్

కృత్రిమ మేధ ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగాలకు ముప్పుగా మారవచ్చునని ఆందోళన చెందుతున్నారు. ఈ పరిస్థితి త్వరలో భారతదేశానికి కూడా కలుగనుంది. ఏ ఇతర దేశం కంటే కూడా భారతదేశానికి పీడకలగా మారే అవకాశం ఉంది. కృత్రిమ మేధ వల్ల ఉద్యోగాల రంగంలో సవాళ్లను ధీటుగా ఎదుర్కొనేందుకు మన ప్రభుత్వం సిద్ధపడలేదు. కొన్ని పత్రాలను రూపొందించడం మినహా గత దశాబ్దికాలంలో ప్రభుత్వం పెద్దగా పట్టించుకోలేదు. క్షేత్రస్థాయిలో ఏ మాత్రం తగిన జాగ్రత్త పడకపోవడం వల్ల కృత్రిమ మేధ నిర్వహణపైన ఎలాంటి నియంత్రణ ఏర్పడలేదు. దాదాపు ఐదేళ్ల క్రితం అంటే 2018 జూన్‌లో నీతి ఆయోగ్ ఒక చర్చాపత్రాన్ని విడుదల చేసింది. 'నేషనల్ స్ట్రాటజీ ఫర్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' (కృత్రిమ మేధ జాతీయ వ్యూహ పత్రం) రూపొందించి విడుదల చేసింది. 2020లో కొవిడ్-19 మహమ్మారి కారణంగా కలిగే ముప్పును ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ఎంత మాత్రం ప్రయత్నించిందిలేదు. అయితే ఇదే కాలంలో కృత్రిమమేధ నియంత్రణ లేనివిధంగా 45శాతం వినియోగంలోకి వచ్చింది. అదే కాలంలో అమెరికాలో 35శాతం అమలు చేశారు. జపాన్‌లో 28శాతం, బ్రిటన్‌లో 23శాతం, కృత్రిమ మేధను అమలు చేశారు. భారతదేశంలో 2030నాటికి ప్రస్తుతం ఉన్న ఉద్యోగాలలో దాదాపు 9శాతానికిపైగా కోల్పోయే అవకాశం ఉంది. ఇదే కాలంలో 20మిలియన్ల కొత్త ఉద్యోగాలు మాత్రమే సృష్టించే అవకాశం ఉంటుంది. ఈ అంచనా తీవ్ర ఆందోళన కలిగించేట్టుగా ఉంది. ఉద్యోగాల సృష్టికంటే కోల్పోయే ఉద్యోగాల సంఖ్య రెట్టింపు అయ్యేలా అంచనాలు ఉన్నాయి. 2023 జులై నాటికే ఉద్యోగాల విషయంలో పరిస్థితి అత్యంత అధ్వాన్నంగా ఉన్నది. పీడబ్ల్యుసీ కంపెనీ సీఈఓ ఇమడ్‌మస్తక్ చేసిన ప్రకటన స్పష్టం చేస్తున్నది. వచ్చే సంవత్సరం లేదా రెండేళ్ల కాలంలో భారతదేశం ఇప్పుడు అనుసరిస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు పూర్తిగా తుడిచి పెట్టుకుపోయే ప్రమాదం ఉన్నదని ఆయనచెప్పారు. ప్రస్తుతం ఇతర దేశాలకు ఐటీ ఉత్పత్తులను తయారుచేసి అందించే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలకు సంబంధించి 5 మిలియన్ల ప్రోగ్రామ్‌లు ఉన్నాయి.

ఉద్యోగాలు కోల్పోయే విభాగం ఇది ఒక్కటేకాదు, ఆర్థికరంగంలోని అన్ని విభాగాలపైన (శారీరకశ్రమ చేసే పనులు మినహా) తీవ్ర ప్రభావం చూపనుంది. పీడబ్ల్యుసీ అధ్యయన నివేదిక 2020లో కరోనా కల్లోల సమయంలో పరిస్థితిని ప్రకటించింది. ఈ కాలంలో భారతదేశంలోని వివిధ రంగాలలో నిర్దిష్టమైన విధంగా కృత్రిమ మేధ అమలు జరిగింది. అనుకున్న దానికంటే వాణిజ్యం పెరిగింది. రవాణా, ఆతిధ్య రంగాల కంపెనీలలో 89శాతం, టీఎంటి 86శాతం, ఆర్థికసేవలలో 82శాతం, ఆరోగ్యం, ఫార్మ రంగాలలో 73శాతం వాణిజ్యం జరిగింది. 2023 జూన్‌లో పిడబ్ల్యుసీ అధ్యయన నివేదికను విడుదల చేశారు. భారతదేశంలోని ఉత్పత్తి పరిశ్రమలో కృత్రిమ మేధ ద్వారా అధికంగా మార్పు చోటుచేసుకుంది. ఈ మేధస్సు ప్రవేశించిన తర్వాత భారతదేశం 4.0శాతంతో ముందంజలో ఉంది. ఆటోమేషన్, కృత్రిమమేధ విభాగాలలో పనిచాలా గొప్పగా జరిగింది. ఇందుకు సంబంధించి జరిగిన సర్వేలో భారతదేశ కంపెనీలలో 38శాతం పాల్గొన్నాయి. విదేశాల కంపెనీలతో పోలిస్తే భారతదేశంలో ఒకే విధమైన ప్రామాణికమైన డిజిటల్ పరిష్కారాన్ని అమలుచేయడానికే ప్రాధాన్యత ఇచ్చారు. ప్రస్తుతం 54శాతంతో అనలిస్టిక్స్, కృత్రిమ మేధను ఎక్కువగా అమలు చేస్తున్నారు.

మనదేశంలో ప్రస్తుతం వివిధ రంగాలలో కంపెనీలు అమలుచేసిన కృత్రిమ మేధ చాలా అధ్వాన్నంగా ఉంది. ఎక్కువ కంపెనీలు ప్రజలు, విధానాలు, పనిచేసేవారి మానసిక స్థితిపైన ఎక్కువ శ్రద్ధ చూపుతున్నారు. అయితే అంతర్జాతీయ కంపెనీలలో వస్తున్న మార్పు లకు అనుగుణంగా సరైన విధానాన్ని అమలుచేసేందుకు ప్రాధాన్యత ఇస్తున్నట్లుగా పీడబ్ల్యుసీ నివేదిక తెలియ జేసింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో పిడబ్ల్యుసీ విడుదలచేసిన నివేదిక ప్రకారం, ఆయా కంపెనీలు పూర్తిగా తమ కంపెనీలలో మెటావర్స్ విధానాన్ని అమలు చేసింది. 2018లో నీతి ఆయోగ్ ప్రకటించిన వ్యూహపత్రం. ఐదు రంగాలపైన శ్రద్ధపెట్టాలని నిర్ణయించినట్లు వెల్లడించింది. ఈ ఐదురంగాలు కూడా కృత్రిమమేధ ద్వారా సమాజం లోని ప్రజల అవసరాలను తీర్చడానికేనని తెలియజేసింది. ఆరోగ్యభద్రత, వ్యవసాయం, విద్య, స్మార్ట్ నగరాలు, మౌలిక సదుపాయాలు, వేగవంతమైన రాకపోకలు, రవాణా రంగాలలో ఎక్కువ శ్రద్ధపెట్టాలని నిర్ణయించారు. అయితే ఈ నిర్ణయాలను అమలు జరిపేందుకు అనేక అడ్డంకులు ఉన్నాయని ఆ పత్రం పేర్కొంది. ముఖ్యంగా కృత్రిమ మేధను అమలు జరిపేందుకు, పరిశోధనా విభాగంలో విస్తృతమైన నైపుణ్యం లోపించాయి. డాటా ఎకోసిస్టమ్ లేకపోవడం. ఎందుకంటే దీని విలువ చాలా ఎక్కువగా ఉన్నది, కృత్రిమమేధను అమలు జరపడం ఎలాగా అనే చైతన్యం తక్కువగా ఉండటం, అలాగే వ్యక్తిగత గోప్యత, భద్రత కృత్రిమమేధను భాగస్వామ్యంతో అమలుచేసేందుకు అంగీకరించడం దాదాపులేదు. ప్రభుత్వం సైతం క్షేత్ర స్థాయిలో పెద్దగా ఏమీ చేసిందిలేదు. ఈ పరిస్థితులలో కృత్రిమమేధ వల్ల ఉద్యోగాల కల్పనపై తీవ్ర ప్రతికూల ప్రభావం ప్రపంచమంతటా ఉంటుంది. అదే సమయంలో భారతదేశంలో ఎక్కువఉద్యోగాలు కోల్పోవడం ఉంటుంది. మన ప్రభుత్వం ఇంతవరకు నిర్దిష్టమైన న్యాయ ప్రక్రియను రూపొందించలేదు. న్యాయప్రక్రియ సాధనాన్ని అత్యవసరంగా, సమగ్రంగా రూపొందించాలి. లేకపోతే కృత్రిమమేధ నియంత్రణలేనిదై ఉద్యోగాలు ఊడటం అత్యధికంగా ఉంటుంది. ప్రస్తుతం అసంఘటిత రంగం లోనే కార్మికులు దాదాపు 40శాతం ఉన్నారు. రానున్న కాలంలో ఇది 90శాతానికి పెరిగే అవకాశం ఉందని నివేదికలు అంచనావేశాయి.

సామాజికభద్రత, కల్పన అనేది దేశంలో లేకపోవడం వల్ల 74శాతం కార్మికుల జీవనపరిస్థితులు అధ్వాన్నంగా తయారుకానున్నాయి. ప్రస్తుతం 8శాతానికి ఇటూఅటూగా ఉన్న నిరుద్యోగం ఒక్కసారిగా అమాంతం పెరుగుతుందని ఇందుకు కృత్రిమమేధ, ఆటోమేషన్ కారణమవుతాయని నివేదికలు వెల్లడించాయి.

న్యాయానికి విజయం

- రాహుల్ ఎంపీ పదవి పునరుద్ధరణపై కాంగ్రెస్
- నేతలు, కార్యకర్తల సంబరాలు
- 'ఇండియా' నేతల స్వాగతం

న్యూదిల్లీ: రాహుల్‌గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని పునరుద్ధరించడాన్ని కాంగ్రెస్ పార్టీ స్వాగతించింది. సత్యానికి, న్యాయానికి లభించిన విజయంగా అభివర్ణించింది. రాహుల్‌గాంధీ లోక్‌సభ సభ్యత్వం పునరుద్ధరించిన వెంటనే దిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాయలంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. మిఠాయిలు తింటూ నృత్యం చేశారు. లోక్‌సభ సభ్యత్వ రద్దును ఎత్తివేస్తున్నట్లు సోమవారం ఉదయం లోక్‌సభ సెక్రటేరియట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. పార్లమెంటుకు హాజరుకావడానికి ముందు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తన చాంబర్‌లో కాంగ్రెస్ నాయకులు, ఇండియా నేతలకు స్వీట్లు పంచారు. 'రాహుల్‌గాంధీని ఎంపీగా పునరుద్ధరిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. ఇది భారత ప్రజలకు ప్రత్యేకించి వయనాడ్ ప్రజలకు గొప్ప ఉపశమనం' అని ఖర్గే ట్వీట్ చేశారు. ఇప్పటికైనా మించిపోయింది లేదని, ఇక నుంచి వాస్తవిక పాలనపై దృష్టి పెట్టాలని బీజేపీ, మోదీ సర్కారుకు హితవు పలికారు. ప్రతిపక్ష నాయకులు లక్ష్యంగా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయవద్దని సూచించారు. ప్రజాస్వామ్యం గెలిచింది. ఇండియా విజయం సాధించిందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ చెప్పారు. ఎలాంటి భయం లేకుండా వాస్తవాలు మాట్లాడటం ద్వారా పార్లమెంటరీ ప్రయాణాన్ని రాహుల్ రక్షిస్తాడని రాహుల్ భారత్ వాణి అని, ఆయన ఎప్పటికీ మౌనంగా ఉండబోరని స్పష్టంచేశారు. లోక్‌సభలో కాంగ్రెస్ విప్ మానిక్యం ఠాగూర్ స్పందిస్తూ స్వాగతించదగిన నిర్ణయం. కుట్రను ఓడించాం. రాహుల్‌గాంధీ తిరిగి సభకు వచ్చారని ట్వీట్ చేశారు. రాజ్యసభలో కాంగ్రెస్ ఉపనాయకుడు ప్రమోద్ తివారీ స్పందిస్తూ నిజమే గెలుస్తుంది. అబద్ధాలకు ఓటమి తప్పదు. ఇండియా గెలిచింది. తమ సింహం రాహుల్‌గాంధీ విజయం సాధించారు. మోదీ, ఆయన ఆలోచనలు ఓటమి చెందడం ప్రారంభమయ్యాయన్నారు.

రాహుల్‌కు తాత్కాలిక ఊరటే: బీజేపీ ఎంపీ

భోపాల్: రాహుల్‌గాంధీ లోక్‌సభ సభ్యత్వం పునరుద్ధరణ తాత్కాలిక ఊరట మాత్రమేనని బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వ్యాఖ్యానించారు. రాహుల్ శిక్షపై పూర్తిస్థాయి తీర్పు ఇంకా రాలేదని చెప్పారు. రాహుల్ ఎంపీ సభ్యత్వ పునరుద్ధరణపై పీటీఐతో సూర్య సోమవారం మాట్లాడుతూ తుది విచారణ పూర్తయ్యేంత వరకూ ఇది రాహుల్‌కు తాత్కాలిక ఉపశమనం మాత్రమేనన్నారు. సుప్రీంకోర్టు మధ్యంతర ఆదేశాలకు అనుగుణంగా రాహుల్ లోక్‌సభ సభ్యత్వాన్ని తాత్కాలికంగా పునరుద్ధరించారని తెలిపారు. గుజరాత్ హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు సమర్థిస్తే రాహుల్‌గాంధీ సభ్యత్వం సహజంగా మరోసారి రద్దవుతుందని సూర్య వ్యాఖ్యానించారు. ఇది ఎంతోకాలం కొనసాగదని, అప్పటి వరకైనా రాహుల్ సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు.

ప్రజల గొంతుక రాహుల్: ప్రియాంక

పార్లమెంటు సభ్యుడిగా రాహుల్‌గాంధీ తిరిగి లోక్‌సభకు హాజరు కావడంపై కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ సంతోషం వెలిబుచ్చారు. పార్లమెంటులో మరోసారి ప్రజల గొంతుకగా రాహుల్ పనిచేస్తారన్న ఆకాంక్షను వ్యక్తంచేశారు. రాహుల్‌గాంధీ లోక్‌సభ సభ్యత్వం పునరుద్ధరించిన వెంటనే కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయం వద్ద నాయకులు, కార్యకర్తలు మిఠాయిలు పంచుకుంటూ సంబరాలు చేసుకున్నారు. రాహుల్‌కు అనుకూలంగా నినాదాలు చేశారు. రాహుల్‌గాంధీ పార్లమెంటుకు వస్తున్న వీడియోను షేర్ చేస్తూ...ప్రజల వాస్తవిక సమస్యలకు ప్రతినిధిగా పార్లమెంటులో రాహుల్ గళం విప్పుతారని ప్రియాంక ట్వీట్ చేశారు. 'రాహుల్‌గాంధీ కోసం భుజం భుజం కలిపి పోరాటం చేసిన లక్షలాదిమంది కాంగ్రెస్ కార్యకర్తలకు, న్యాయం, సత్యం కోసం జరిగిన పోరాటంలో మద్దతుగా నిలిచిన కోట్లాదిమంది ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు' అని ప్రియాంక ట్వీట్ చేశారు.

ప్రజాస్వామ్య విజయం: మహారాష్ట్ర నేతలు

ముంబై: రాహుల్‌గాంధీ లోక్‌సభ సభ్యత్వం పునరుద్ధరణను ప్రజాస్వామ్య విజయంగా మహారాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నేతలు విజయ్ వాడెట్టివర్, అశోక్ చవాన్ సోమవారం అభివర్ణించారు. రాహుల్ తిరిగి లోక్‌సభకు హాజరు కావడంపై సంతోషం వెలిబుచ్చారు. రాహుల్‌పై అనర్హతను ఎత్తివేయడంతో ప్రతిపక్ష కూటమి ఇండియా బలం మరింత పెరిగిందని స్పష్టం చేశారు. రాహుల్‌గాంధీ తిరిగి లోక్‌సభకు హాజరు కావడాన్ని శివసేన(ఉద్ధవ్) ఎంపీ అరవింద్ సావంత్ స్వాగతించారు. తనకు జరిగిన అన్యాయం గురించి రాహుల్ గాంధీ బయటపెడతారని కేంద్రం ప్రభుత్వం భయపడు తోందని, సామాన్యుల సమస్యలను రాహుల్ లోక్‌సభలో వినిపించడాన్ని కొనసాగిస్తారని ఆశిస్తున్నట్లు మహారాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నేత వాడెట్టివర్ విలేకరులతో చెప్పారు. రఫేల్ యుద్ధ విమానాల ఒప్పందంలో అవకతవకలు, అదానీ గ్రూపు అక్రమాలను రాహుల్ గాంధీ లోక్‌సభలో బలంగా వినిపించారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ తప్పుడు నిర్ణయాలను రాహుల్ నిరంతరం విమర్శించారని, ఇప్పుడు కూడా అలాగే చేస్తారని ఆశాభావం వెలిబుచ్చారు. రాహుల్ తిరిగి లోక్‌సభలో అడుగుపెట్టడం ప్రతిపక్ష ఇండియా బలం మరింత పటిష్టమంతమవుతుందని వాడెట్టివర్ అన్నారు. అశోక్ చవాన్ ట్వీట్ చేస్తూ ఈ నిర్ణయం కోసం దేశమంతా ఎదురుచూస్తోందని, దీనిని న్యాయం, ప్రజాస్వామ్య విజయంగా అభివర్ణించారు. రాహుల్ ఎంపీ పదవి పునరుద్ధరణ కాంగ్రెస్ కార్యకర్తలకే కాకుండా దేశంలో ప్రజాస్వామ్య మద్దతుదారులందరికీ సంతోషమేనన్నారు. దేశ స్వాతంత్ర్యం ప్రమాదంలో పడింది. రాహుల్ లోక్‌సభకు రావడాన్ని స్వాగతిస్తున్నాం. సుప్రీంకోర్టు నిర్ణయం ప్రభుత్వ కుట్రకు చెంపపెట్టని శివసేన(ఉద్ధవ్) ఎంపీ అరవింద్ సావంత్ ట్వీట్ చేశారు.

బెయిల్ కోసం దిల్లీ హైకోర్టుకు నాయర్

న్యూదిల్లీ: దిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించి మనీలాండరింగ్ కేసులో బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వ్యాపారవేత్త, ఆమ్ ఆద్మీ పార్టీ కమ్యూనికేషన్ ఇన్‌చార్జి విజయ్ నాయర్ సోమవారం దిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్ జస్టిస్ దినేశ్ కుమార్ శర్మ ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. అయితే ఆయన కోర్టుకు రాకపోవడంతో దీనిని ఆగస్టు 10వ తేదీ విచారణ జాబితాలో చేర్చారు. 2022 నవంబరు 13న నాయర్‌ను ఈ కేసులో అరెస్టు చేశారు. తనకు బెయిల్ నిరాకరిస్తూ విచారణ కోర్టు జులై 29న ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ నాయర్ హైకోర్టులో పిటిషన్ వేశారు. విచారణ కోర్టులో వాదప్రతివాదనలు విన్న మేజిస్ట్రేట్...నాయర్ బెయిల్ పిటిషన్‌ను తోసిపుచ్చింది. ఈ పిటిషన్‌ను ఈడీ తీవ్రంగా వ్యతిరేకించింది.

జల్ జీవన్ మిషన్ కింద రాష్ట్రాలు వినియోగించని నిధులు రూ.16,484 కోట్లు

న్యూదిల్లీ: జల్ జీవన్ మిషన్ కింద కేంద్ర నిధి నుంచి రూ. 16,484 కోట్ల నిధులు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు వినియోగించక నిరుపయోగంగా ఉన్నాయి. ఇదే విషయాన్ని సోమవారం ప్రభుత్వం రాజ్యసభలో తెలిపింది. 2024 నాటికి గ్రామీణ ప్రాంత ప్రజలకు తగినంత సురక్షిత తాగునీటి అందించడం ఈ మిషన్ లక్ష్యం. ఈ సందర్భంగా తాగునీరు అత్యవసరమైనది కావడం వలన రాష్ట్రాలకు సరఫరా పథకాలను ప్రణాళికాబద్ధంగా అమలు చేయడంతో పాటు జాగ్రత్తగా నిర్వహించాల్సి అవసరం ఉందని కేంద్ర జలశక్తి సహాయ మంత్రి ప్రహ్లాద్ సింగ్ పటేల్ రాజ్యసభలో ఒక ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. జల్ జీవన్ మిషన్ కింద రూ.16,484 కోట్ల కేంద్ర నిధులు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు వినియోగించకుండా ఉన్నాయని మంత్రి డేటా తెలుపుతుంది. మహారాష్ట్రలో రూ.2,401 కోట్లు, రాజస్థాన్‌లో రూ.1,552 కోట్లు, కర్నాటకలో రూ. 1,225 కోట్లు ఉపయోగించకుండా ఉన్నాయి.

బీజేపీ, హిందువులకే మోదీ ప్రధాని: గెహ్లాత్

జైపూర్: ప్రధాని నరేంద్రమోదీపై రాజస్తాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాత్ సోమవారం విరుచుకుపడ్డారు. ఆయన కేవలం హిందువులు, బీజేపీకి మాత్రమే ప్రధాని అన్న భ్రాంతిలో బతుకుతున్నారని మండిపడ్డారు. మోదీ కేవలం మహాత్మాగాంధీ దేశం(భారత్) నుంచి వచ్చారన్న కారణంతోనే విదేశాల ప్రజలు ఆయనను గౌరవిస్తున్నారని, కాంగ్రెస్ కారణంగానే భారత్‌లో ప్రజాస్వామ్యం, సజావుగా ఎన్నికలు జరుగుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో కొత్త జిల్లాల ఏర్పాటును పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గెహ్లాత్ ప్రసంగించారు. 'బీజేపీకే ప్రధానిని అనే భ్రాంతిలో మోదీ ఉన్నారు. ఆయన ప్రవర్తన, ప్రసంగాలు, హావభావాలు వంటివి పరిశీలిస్తే మోదీ పార్టీకి, హిందువుల ప్రధానిగానే కనిపిస్తున్నారు' అని గెహ్లాత్ విమర్శించారు. ఇది అత్యంత ప్రమాదకర పరిణామమని హెచ్చరించారు. రూల్ ఆఫ్ బ్యాలెట్‌ను కాంగ్రెస్ అద్భుతంగా ముందుకు తీసుకెళ్లడం వల్లే ప్రజాస్వామ్యదేశంలో మోదీ ప్రధానిగా ఎన్నికయ్యారని చెప్పారు. బీజేపీ, హిందువులకు మాత్రమే తాను ప్రధానమంత్రిని అని మోదీ ఎందుకు భావిస్తున్నారని ప్రశ్నించారు. పెద్ద ప్రపంచ నాయకుడిగా చెప్పుకుంటున్న మోదీ...మణిపూర్ హింస గురించి ప్రపంచం ఎలా ఆలోచిస్తుందో తెలియదా అని నిలదీశారు. మణిపూర్‌లో ఇద్దరు గిరిజన మహిళలను నగ్నంగా నడిరోడ్డుపై ఊరేగించడాన్ని, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు రాజస్తాన్, చత్తీస్‌గఢ్ పరిణామాలను పోల్చడం అత్యంత జుగుప్సాకరమని వ్యాఖ్యానించారు.

సొంత పార్టీ సభ్యులే నన్ను చంపాలని చూస్తున్నారు..

ఎన్‌సీపీ ఎమ్మెల్యే థామస్ ఫిర్యాదు

తిరువనంతపురం: కేరళలోని అధికార లెఫ్ట్ ఫ్రంట్‌కు చెందిన ఎన్సీపీ ఎమ్మెల్యే ఒకరు తన సొంత పార్టీకి చెందిన కొంత మంది సభ్యుల నుంచి తనకు ప్రాణహాని ఉందని ఆరోపిస్తూ రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారికి ఫిర్యాదు చేశారు. అయితే దీనిపై ఎన్సీపీ రాష్ట్ర అధ్యక్షుడు పీసీ చాకో నిరాధారం అంటూ కొట్టివేశారు. నేషనల్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే థామస్ కే థామస్ స్థానిక టీవీ ఛానల్‌లో మాట్లాడుతు ఈ విషయాన్ని తెలిపారు. ఎమ్మెల్యే చేస్తున్న వాదనలు అసంబధమైనవని, పార్టీకి ఎలాంటి సంబంధం లేదని, అందులో ఎలాంటి వాస్తవం లేదని చాకో అన్నారు. పార్టీలో ఇంతకుముందెన్నడూ ఇలాంటివి పరిణామాలు చోటు చేసుకోలేదని అన్నారు. ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే అలపుజలో పేరున్న పెద్ద మనిషని, ప్రసిద్ధ వ్యాపారవేత్త అని చాకో పేర్కొన్నారు. తనని చంపడం ద్వారా నియోజకవర్గానికి ఉప ఎన్నికలు తీసుకురావడం తన శత్రువుల ఉద్దేశ్యమని థామస్ ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తనపై మూడు తప్పుడు కేసులు పెట్టారని, అయితే అవి నిరాధరమని పోలీసులు తేల్చారని థామస్ తెలిపారు. అయితే ఇవంతా అంతర్గత పోరు ఫలితమేనని కొన్ని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

మా రాష్ట్రంలో రైళ్లు సక్రమంగా నడవటం లేదు..

ప్రధానికి చత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి ఫిర్యాదు

రాయ్‌పూర్: రాష్ట్రంలో ప్యాసింజర్ రైళ్లు సక్రమంగా నడవకపోవడం వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎత్తి చూపుతూ చత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేష్ బఘెల్ ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారని సోమవారం అధికారి ఒకరు తెలిపారు. పబ్లిక్ రిలేషన్స్ డిపార్ట్‌మెంట్ విడుదల చేసిన ఒక ప్రకటన ప్రకారం ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండానే రైల్వే అనేక రైళ్లను రద్దు చేసిందని, ఈ రైళ్లు ఎంతకాలం రద్దు చేయబడతాయో ప్రయాణికులకు తెలియజేయడంలేదని ముఖ్యమంత్రి తన లేఖలో పేర్కొన్నారు. రద్దుతో పాటు రైళ్లు ఆలస్యంగా రావడంతో ప్రయాణికులు అసౌర్యానికి గురవుతున్నారని తెలిపారు. ప్యాసింజర్ రైళ్లను సజావుగా నడిపేందుకు గతంలో రైల్వే మంత్రికి లేఖ రాసినా పరిస్థితి మెరుగుపడలేదని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. రైళ్లు సక్రమంగా నడవకపోవడంతో విద్యార్థులు, యాత్రికులు, రోగులు, వ్యాపారులు, కార్మికులు, ఇతర ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవతున్నారని బఘెల్ తన లేఖలో ప్రస్తావించారు. చత్తీస్‌గఢ్‌లోని భౌగోళిక పరిస్థితుల దృష్ట్యా రైళ్ల సాంద్రత జాతీయ సగటు కంటే తక్కువగా ఉందని, మారుమూల ప్రాంతాల్లో నివసించే ప్రజలకు అందుబాటులో ఉండే ఏకైక రవాణా మార్గం రైళ్లేనని ప్రధానికి రాసిన లేఖలో బఘెల్ తెలిపారు.

దేశాభివృద్ధికి అడ్డంకులు

ప్రధాని మోదీ

న్యూదిల్లీ: భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చడంలో కొంతమంది వ్యక్తులు అడ్డంకులు సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారని, ఇప్పుడు పౌరులు అవినీతి, వారసత్వం, బుజ్జగింపులను 'క్విట్ ఇండియా' కోరుతున్నారని ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం అన్నారు. ఇక్కడి భారత్ మండపంలో జరిగిన జాతీయ చేనేత దినోత్సవ వేడుకలో ప్రధాని మాట్లాడుతూ స్వదేశీ విషయంలో దేశంలో కొత్త విప్లవం వచ్చిందని, రాబోయే పండుగల సందర్భంగా స్థానిక ఉత్పత్తులకు మరింత ప్రోత్సాహం ఇవ్వాలని పౌరులను కోరారు. దేశంలో 'నయా-మధ్యతరగతి' పెరుగుతోందని, ఇది టెక్స్‌టైల్ కంపెనీలకు పెద్ద అవకాశాన్ని కల్పిస్తోందని ఆయన అన్నారు. ప్రతిపక్ష కూటమి 'ఇండియా' దాడి చేస్తూ, దేశం ఇప్పుడు ఏక స్వరంతో అవినీతి, వారసత్వ రాజకీయాలు వంటి వాటిని 'క్విట్ ఇండియా' కోసం అడుగుతున్నదని మోదీ అన్నారు. దేశంలో ఖాదీ ఆదరణ పెరుగుతుండడాన్ని ప్రస్తావిస్తూ, 2014కు ముందు సుమారు రూ.25 వేల నుంచి 30 వేల కోట్లుగా ఉన్న విక్రయాలు ఇప్పుడు రూ.1.30 లక్షల కోట్లకు పెరిగాయని తెలిపారు. భారతదేశ చేనేత, ఖాదీ, టెక్స్‌టైల్ రంగాన్ని ప్రపంచ ఛాంపియన్‌గా మార్చడమే మా ప్రయత్నమని ఆయన అన్నారు. 'ఒక జిల్లా, ఒకే ఉత్పత్తి' కార్యక్రమం ద్వారా వివిధ జిల్లాల్లో తయారైన విశిష్ట ఉత్పత్తులను ప్రచారం చేస్తున్నామని, గుజరాత్‌లోని 'స్టాచ్యూ ఆఫ్ యూనిటీ' వద్ద ఉన్నటువంటి 'ఏక్తా మాల్స్'ను దేశవ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్నామని ప్రధాని తెలిపారు. టెక్స్‌టైల్, ఫ్యాషన్ పరిశ్రమలు తమ పరిధిని విస్తరించుకోవాలని, భారతదేశాన్ని ప్రపంచంలోని మూడు అగ్రశ్రేణి ఆర్థిక వ్యవస్థలలోకి తీసుకెళ్లేందుకు గణనీయంగా కృషి చేయాలని మోదీ పిలుపునిచ్చారు.

గుజరాత్‌లో ఆప్, కాంగ్రెస్ పొత్తు

అహ్మదాబాద్: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో గుజరాత్‌లో ఆప్, కాంగ్రెస్ కలిసి పోటీ చేస్తాయని ఆమ్ ఆద్మీ పార్టీ గుజరాత్ విభాగం అధ్యక్షుడు ఇసుదన్ గాధ్వి సోమవారం తెలిపారు. ప్రతిపక్ష 'ఇండియా' కూటమిలో సభ్యులుగా ఉన్న ఈ రెండు పార్టీల మధ్య సీట్ల పంపిణీ సూత్రం ప్రకారం పొత్తు ఉంటుందని అన్నారు. గాధ్వి ప్రకటనపై కాంగ్రెస్ స్పందిస్తూ, పార్టీ కేంద్ర నాయకత్వం ఆదేశాలకు కట్టుబడి ఉంటుందని తెలిపింది. ఆప్, కాంగ్రెస్ మధ్య పొత్తు అధికార పార్టీ ఎన్నికల అవకాశాలను ప్రభావితం చేయదని, కాంగ్రెస్ పార్టీకి ఆప్ 'బీ' టీమ్ అని బీజేపీ పేర్కొంది. 'ఆప్, కాంగ్రెస్ రెండూ 'ఇండియా' కూటమిలో భాగమే. ఈ ఎన్నికల పొత్తు గుజరాత్‌లోనూ అమలు కానుంది. పొత్తుకు సంబంధించిన చర్చలు ఇంకా ప్రాథమిక స్థాయిలోనే ఉన్నప్పటికీ, గుజరాత్‌లో వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఆప్, కాంగ్రెస్ రెండూ సీట్ల పంపిణీ సూత్రం ప్రకారం పోటీ చేయడం ఖాయం. అన్నీ అనుకున్నట్లు జరిగితే, ఈసారి గుజరాత్‌లోని మొత్తం 26 స్థానాలను బీజేపీ గెలుచుకోదని నేను హామీ ఇస్తున్నాను' అని గాధ్వి ఇక్కడ విలేకరులతో అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని పార్టీ 'ఇండియా' కూటమిలో చేరిందని ఆయన అన్నారు. 'ఆప్ గుజరాత్ రాష్ట్ర విభాగం ఇప్పటికే పార్టీ అభ్యర్థులను నిలబెట్టగల స్థానాలపై పరిశోధన చేయడం ప్రారంభించింది' అని గాధ్వి చెప్పారు. ఆప్ గుజరాత్ అధ్యక్షుడు హఠాత్తుగా చేసిన ప్రకటనపై కాంగ్రెస్ స్పందిస్తూ, తుది పిలుపును కేంద్ర నాయకత్వం తీసుకుంటుందని తెలిపింది. 'నేను ఆయన ప్రకటన గురించి ఇప్పుడే తెలుసుకున్నాను. ఇతర పార్టీలతో సీట్ల పంపకాల ఒప్పందాలను కేంద్ర నాయకత్వం ఖరారు చేసింది. ఎన్నికల ముందు పొత్తులు నిర్ణయించుకోవడం వారి ప్రత్యేకాధికారం. ఈ అంశాన్ని కేంద్ర నాయకత్వం లేవనెత్తినప్పుడు రాష్ట్ర నాయకత్వం చర్చిస్తుంది' అని చెప్పారు. ఈ విషయంలో మా జాతీయ నాయకుల ఆదేశాలను గుజరాత్ కాంగ్రెస్ అనుసరిస్తుందని గుజరాత్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి మనీష్ దోషి మీడియా ప్రతినిధులతో అన్నారు. ముఖ్యమైన విషయమేమిటంటే, 2022 గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్, ఆప్ ఒక దానిపై మరొకటి పోరాడాయి. 182 మంది సభ్యులున్న సభలో కాంగ్రెస్ 17 సీట్లు గెలుచుకోగా, ఆప్ ఐదు సీట్లు గెలుచుకోగలిగింది.

మణిపూర్‌పై పట్టువీడని విపక్షాలు

- చైనా నిధుల అంశాన్ని తెరపైకి తెచ్చిన బీజేపీ
- రాజస్తాన్ శాంతిభద్రతలపైనా చర్చకు డిమాండ్
- పార్లమెంటు వాయిదా
- కాంగ్రెస్ ఎంపీపై సస్పెన్షన్ ఎత్తివేత

న్యూదిల్లీ: మణిపూర్ హింస, భారత్‌కు చైనా నిధులు, రాజస్తాన్‌లో శాంతిభద్రతల అంశాలు పార్లమెంటు ఉభయసభలను సోమవారం కుదిపేశాయి. అధికార, ప్రతిపక్ష సభ్యులు పరస్పరం విమర్శలు చేసుకున్నారు. సభ కార్యకలాపాలు జరగకుండా అడ్డుకున్నారు. మణిపూర్ హింసపై చర్చించాల్సిందేనని విపక్షాలు పట్టుబట్టగా భారత్‌కు చైనా నిధులు, రాజస్తాన్‌లో శాంతిభద్రతలు క్షీణించాయని, ఆ అంశాలపై చర్చించాలని అధికార పక్ష సభ్యులు డిమాండ్ చేశారు. దీంతో ఉభయ సభలు ముందు 12 గంటల వరకు...తర్వాత మధ్యాహ్నం రెండు గంటల వరకు వాయిదా పడ్డాయి. లోక్‌సభ సమావేశమైన వెంటనే ప్రతిపక్ష సభ్యులు లేచి...వెల్‌లోకి దూసుకెళ్లారు. మణిపూర్‌లో హింస కొనసాగడంపై నిరసన తెలిపారు. దీనిపై ప్రధాని నరేంద్రమోదీ ప్రకటన చేయాలన్న డిమాండ్‌ను పునరుద్ఘాటించారు. తీవ్ర అసహనానికి గురైన స్పీకర్ ఓం బిర్లా... ప్రశ్నోత్తరాలలో పాల్గొనే ఆసక్తి ఉందా లేదా అని ప్రతిపక్ష సభ్యులను అడిగారు. 'ప్రశ్నోత్తరాలు కొనసాగడం మీకు ఇష్టం లేదా? నినాదాలు చేయడానికే సభ కాదు. మీరు కేవలం నినాదాలు చేయడానికే సభకు వస్తున్నారు' అని బిర్లా ఆగ్రహం వెలిబుచ్చారు. ప్రతిపక్ష సభ్యులు తమ నిరసన కొనసాగిస్తుండటంతో స్పీకర్ సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన జులై 20 నుంచి ఉభయసభలను మణిపూర్ అంశం కుదిపేస్తోంది. తిరిగి 12 గంటలకు సభ సమావేశం కాగానే భారత్‌కు చైనా నిధులు వస్తున్నట్లు వచ్చిన వార్తలను అధికార పార్టీ ప్రస్తావించింది. దీనిపై అధికార, విపక్షాల మధ్య పరస్పర విమర్శలు కొనసాగాయి. వెబ్ పోర్టల్ న్యూస్ క్లిక్‌కు రూ.38 వేల కోట్లు అందాయని, భారత్ వ్యతిరేక వాతావరణం సృష్టించేందుకు ఆ డబ్బు వినియోగిస్తున్నట్లు న్యూయార్క్ టైమ్స్ వార్తకథనాలు ప్రచురించిందని బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే చెప్పారు. న్యూస్ క్లిక్ అనేది భారత్ వ్యతిరేక పోర్టల్ అని, ఆ నిధుల లబ్ధిదాలరుపై ప్రభుత్వం విచారణ చేయాలని దూబే డిమాండ్ చేశారు. 2005-14 మధ్యకాలంలో చైనా ప్రభుత్వం కాంగ్రెస్‌కు పెద్దఎత్తున డబ్బు పంపిందని, భారత్‌ను విభజించాలని కాంగ్రెస్ కోరుకుంటున్నదని దూబే విమర్శించారు. దీనిపై కాంగ్రెస్ సభ్యులు విరుచుకుపడ్డారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ అంశం లేవనెత్తిన సమయంలో రాహుల్‌గాంధీ సభలోనే ఉన్నారు. అధికార, ప్రతిపక్ష సభ్యులు పరస్పర వ్యతిరేక నినాదాలు చేసుకుంటుండగా స్పీకర్ స్థానంలో కూర్చున్న కిరిట్ సోలంకి సభను మధ్యాహ్నం రెండు గంటల వరకు వాయిదా వేశారు.

రాజ్యసభలోనూ ఇదే తీరు

రాజ్యసభలోనూ ప్రతిపక్ష, అధికార పక్ష సభ్యులు పరస్పరం విమర్శలు సంధించుకున్నారు. మణిపూర్‌పై చర్చ కోసం ప్రతిపక్షాలు పట్టుబట్టగా రాజస్తాన్‌లో శాంతిభద్రతల పరిస్థితిపై చర్చించాలని అధికార సభ్యులు డిమాండ్ చేశారు. సభ తిరిగి సమావేశం కాగానే కాంగ్రెస్ ఎంపీ రజనీ పాటిల్ సస్పెన్షన్‌ను మూజువాణి ఓటుతో ఎత్తివేశారు. రాజస్తాన్‌లో మహిళలపై అరాచకాలు జరుగుతున్నాయని, దీనిపై చర్చించాలని అదికార సభ్యులు డిమాండ్ చేశారు. అయితే, మణిపూర్‌లో నెలకొన్న పరిణామాలపై చర్చించాలని కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షసభ్యులు డిమాండ్ చేశారు. సభలో గందరగోళం చెలరేగడంతో సభా నాయకుడు, కేంద్రమంత్రి పీయూశ్ గోయల్ జోక్యం చేసుకుంటూ మణిపూర్‌పై స్వల్పకాలిక చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. అయితే, ప్రతిపక్షం అందుకు ముందుకు రావడం లేదని ఆరోపించారు.

సభా కార్యకలాపాలను వీడియో తీస్తూ సభా నిబంధనలు ఉల్లంఘించారన్న ఆరోపణపై పార్లమెంటు బడ్జెట్ సమావేశాల సమయంలో కాంగ్రెస్ సభ్యులు రజినీ పాటిల్‌ను రాజ్యసభ నుంచి సస్పెండ్ చేశారు. ఆమె సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ తీర్మానం చేశారు. ఆ తర్వాత గందరగోళం కొనసాగడంతో చైర్మన్ జగదీప్ ధన్కర్ సభను మధ్యాహ్నం రెండు గంటల వరకు వాయిదా వేశారు.

దిల్లీ ఎయిమ్స్‌లో అగ్ని ప్రమాదం

తప్పిన ప్రాణాపాయం

న్యూదిల్లీ: దిల్లీలోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) లో సోమవారం అగ్ని ప్రమాదం సంభవించింది. పాత ఓపీడీ భవనానికి చెందిన రెండవ అంతస్తులోని ఎండోస్కోపీ గదిలో మంటలు చెలరేగాయి. రోగులందరినీ సురక్షితంగా తరలించినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. అగ్నిప్రమాదం కారణంగా పాత ఓపీడీ భవనంలో ఎండోస్కోపీ, ఎమర్జెన్సీ, డయాగ్నస్టిక్స్ సేవలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ప్రమాదం జరిగిన భవనం కిటికీల నుంచి నల్లటి పొగలు రావడం కనిపించింది. ప్రమాదం సమాచారం తెలిసిన వెంటనే అగ్నిమాపక దళాలు ఘటనా స్థలికి చేరుకొని మంటలను ఆర్పివేశాయి. ఎయిమ్స్ ప్రధాన భవనంలోని పాత రాజ్ కుమారి అమృత్ కౌర్ ఓపీడీ రెండవ అంతస్తులో ఉదయం 11.55 గంటలకు మంటలు చెలరేగాయని, 13 వాటర్ టెండర్లను సేవలో ఉంచామని, మధ్యాహ్నం 1 గంటకు మంటలను అదుపులోకి తెచ్చామని అధికారులు తెలిపారు. మంటలను ఆర్పేందుకు ఆస్పత్రిలోని భూగర్భ ట్యాంక్‌లోని నీటిని కూడా ఉపయోగించినట్లు ఎయిమ్స్ వర్గాలు తెలిపాయి. 'అగ్నిప్రమాదం సంభవించినప్పుడు, ఇద్దరు రోగులు ఎండోస్కోపీ గదిలో ఒక ప్రక్రియలో ఉన్నారు. ఈ ఇద్దరు రోగులతో పాటు వెయిటింగ్ ఏరియాలో ఉన్న మరో 90 మందిని ఖాళీ చేయించారు' అని సీనియర్ వైద్యుడు తెలిపారు. అయినప్పటికీ, తరలించబడిన రోగుల సంఖ్యను అధికారికంగా ప్రకటించలేదు. ఐసీయూలో ఉన్న ఆరుగురితో సహా మరో 30 మంది రోగులను ఎబి 2 వార్డు నుంచి, భవనంలోని ఇతర వార్డులకు తరలించినట్లు సీనియర్ వైద్యుడు వెల్లడించారు. వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, గార్డులు పొగ బయటకు రావడానికి రెండవ అంతస్తులోని కొన్ని గాజు కిటికీలను కూడా పగలగొట్టారు. ఆ ప్రాంతమంతా పొగలు కమ్ముకోవడంతో గ్రౌండ్ ఫ్లోర్‌లోని పీడియాట్రిక్, అడల్ట్ ఎమర్జెన్సీ వార్డుల్లోని రోగులందరినీ కూడా ఖాళీ చేయించారు. కొంతమంది రోగులను సమీపంలోని సఫ్దర్‌జంగ్ ఆస్పత్రికి తరలించారు. ఆ సమయంలో రెండవ అంతస్తులోని ఆర్థోపెడిక్ ఆపరేషన్ థియేటర్ పని చేస్తుంది. దీంతో రోగులను కూడా అక్కడ నుంచి ఖాళీ చేయవలసి వచ్చింది. ఎండోస్కోపీ గది స్టోర్ ప్రాంతంలో మంటలు చెలరేగాయని, అయితే కారణం వెంటనే తెలియరాలేదని వారు తెలిపారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని, నష్టాన్ని అంచనా వేయడానికి సేఫ్టీ ఆడిట్ నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఫొటోగ్రాఫర్‌పై కత్తితో దాడి

న్యూదిల్లీ: ఉత్తర దిల్లీలోని సబ్జీ మండీ ప్రాంతంలో ఓ ఫొటోగ్రాఫర్‌తో జరిగిన వివాదం కారణంగా అతనిపై కత్తితో తండ్రీ కొడుకులు దాడి చేశారు. దాడికి పాల్పడిన సదరు వ్యక్తి కుమారుడు మైనర్ అని పోలీసులు సోమవారం తెలిపారు. ఆదివారం మల్కాగంజ్ రోడ్డులోని భీమ్ వాలీ గలిలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి పోలీసులకు సమాచారం అందిందని, ఘర్షణలో నరేందర్ అనే ఫొటో గ్రాఫర్‌ను అమిత్, అతని మైనర్ కొడుకు కత్తితో పొడిచినట్లు తేలిందని పోలీసు అధికారి తెలిపారు. వృత్తిరిత్యా ఫొటోగ్రాఫర్ అయిన బాధితుడికి పొత్త కడుపు కింద భాగంలో కత్తిపోట్లు పడ్డాయి. నగదు సంబంధిత వివాదం చెలరేగడంతో నరేందర్‌పై అమిత్ అభ్యంతర కరమైన పదజాలాన్ని ఉపయోగించినప్పుడు ఇద్దరి మధ్య గొడవ తీవ్రమైందని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ సాగర్ సింగ్ కల్సీ తెలిపారు.

నుహ్‌లో 'బుల్డోజ్'కు బ్రేక్

నిలిపివేయాలని ఆదేశించిన పంజాబ్-హరియాణా హైకోర్టు

గురుగ్రామ్ మజార్‌లో ఆలయానికి నిప్పు పెట్టిన దుండగులు

గురుగ్రామ్/చండీగఢ్ : మతపరమైన అల్లరు జరిగిన హరియాణాలోని నుహ్ పట్టణంలో (బుల్డోడ్) కూల్చివేత కార్యక్రమాన్ని పంజాబ్, హరియాణా హైకోర్టు సోమవారం నిలిపివేసింది. ఇక్కడ అధికారులు గత వారం మత ఘర్షణల తరువాత 'అక్రమంగా నిర్మించిన' భవనాలను కూల్చివేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఇదిలాఉండగా, గుర్తుతెలియని వ్యక్తులు గురుగ్రామ్ పక్కనే ఉన్న మజార్‌లో నిప్పంటించారని ఆరోపణలు వచ్చాయి. జస్టిస్ జి.ఎస్.సంధావాలియా న్యాయస్థానం నుహ్‌లో జరిగిన కసరత్తును సుమోటోగా స్వీకరించింది. ఇకపై కూల్చివేతలను చేపట్టవద్దని హరియాణా ప్రభుత్వాన్ని ఆదేశించింది. జులై 31న విశ్వహిందూ పరిషత్ ఊరేగింపుపై రాళ్లు రువ్విన గుంపు లక్ష్యంగా చేసుకున్నప్పుడు కొన్ని భవనాలను అల్లర్లకు ఉపయోగించుకున్నారని అధికారులు తెలిపారు. ఇది గురుగ్రామ్‌కు విస్తరించిన మత ఘర్షణలకు దారితీసింది. ఈ హింసాకాండలో ఇద్దరు హోంగార్డులు, ఒక మతపెద్ద సహా ఆరుగురు చనిపోయారు. ఆదివారం నుహ్ జిల్లాలో అధికారులు మతపరమైన ఊరేగింపుపై రాళ్లు రువ్వినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న హోటల్‌తో సహా కొన్ని అక్రమ నిర్మాణాలను ధ్వంసం చేయడంతో హైకోర్టు సుమోటోగా ఆ కసరత్తును స్వీకరించింది. ఇకపై కూల్చివేతలను చేపట్టవద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. కోర్టు ఆదేశాల మేరకు జిల్లాలో కూల్చివేతలను నిలిపివేసినట్లు నుహ్ డిప్యూటీ కమిషనర్ ధీరేందర్ ఖర్గత తెలిపారు. అక్రమ నిర్మాణాలకు వ్యతిరేకంగా కూల్చివేతను ఆపాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. గత మూడు రోజుల్లో జిల్లాలో 37 చోట్ల 57.5 ఎకరాల్లో అక్రమ కట్టడాలను తొలగించారు. సోమవారం వరకు జిల్లాలో 162 శాశ్వత, 591 ముడి నిర్మాణాలు కూల్చివేసినట్లు అధికారులు వివరించారు. సోమవారం తెల్లవారుజామున గురుగ్రామ్‌లోని ఖండ్సా గ్రామంలో ముస్లింలు, హిందువులు సందర్శించే మజార్ వద్ద కొంత ప్రార్థన సామాగ్రికి నిప్పంటించారని మందిరం సంరక్షకుడు ఘూసితే రామ్ తెలిపారు. సెక్టార్ 37 పోలీస్ స్టేషన్‌లో రామ్ దాఖలు చేసిన ఫిర్యాదు ప్రకారం, గుడిలో అగ్నిప్రమాదం గురించి అర్ధరాత్రి 1.30 గంటలకు అతనికి ఫోన్ కాల్ వచ్చింది. ప్రజల సహకారంతో మంటలను అదుపులోకి తెచ్చామని తెలిపారు. కానీ మజార్ లోపల ఉంచిన ప్రార్థన సామాగ్రి కాలిపోయిందన్నారు. తాను సుమారు ఏడేళ్లుగా ఈ మందిరంలో పని చేస్తున్నానని, అన్ని మతాల ప్రజలు అక్కడ తమ గౌరవాన్ని అందజేస్తున్నారని ఆయన చెప్పారు. మార్కెట్ మధ్యలో ఉన్న చిన్న మందిరం లోపలి గోడలపై 'పీర్ బాబా' సమాధితో పాటు హిందూ దేవతల చిత్రాలు కూడా ఉన్నాయి. బయటి గోడపై కూడా హిందూ దేవత చిత్రం, ఓం, స్వస్తిక్ చిహ్నాలు ఉన్నాయి. రామ్ సోమవారం ఉదయం పీటీఐతో మాట్లాడుతూ 'ఇది దశాబ్దాల నాటి 'పీర్ బాబా' మజర్... గ్రామస్తులందరూ ఇక్కడ ప్రార్థనలు చేస్తారు' అని తెలిపారు. పోలీసులు ఐపీసీ సెక్షన్ 34 (ఉమ్మడి ఉద్దేశంతో చాలా మంది వ్యక్తులు చేసిన చర్యలు), 153ఎ (వివిధ సమూహాల మధ్య శత్రుత్వాన్ని ప్రోత్సహించడం), 188 (ప్రభుత్వ సేవకుడు విధిగా ప్రకటించబడిన ఉత్తర్వును ఉల్లంఘించడం), 436 (ఇంటిని నాశనం చేయాలనే ఉద్దేశంతో అగ్ని లేదా పేలుడు పదార్థం ద్వారా అల్లర్లు) కింద గుర్తు తెలియని వ్యక్తులపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. నిందితులను గుర్తించి అరెస్ట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నామని పోలీసు ఉన్నతాధికారి తెలిపారు. పొరుగున ఉన్న నుహ్ జిల్లాలో ప్రారంభమైన మత ఘర్షణల దృష్ట్యా గురుగ్రామ్‌లో సీఆర్‌పీసీ సెక్షన్ 144 కింద నిషేధాజ్ఞలు ఇప్పటికీ అమలులో ఉన్నప్పుడు ఈ సంఘటన జరిగింది. గత వారం నగరం, సమీప ప్రాంతాలకు విస్తరించింది. గురుగ్రామ్ జిల్లా యంత్రాంగం సోమవారం నలుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు సమావేశాన్ని నిషేధించే సెక్షన్ 144ను ఎత్తివేసింది. ఇదిలా ఉండగా, గురుగ్రామ్‌లోని రథివాస్ గ్రామ సమీపంలోని ఓ తినుబండారానికి (ధాబా) శనివారం రాత్రి నిప్పుపెట్టినట్లు పోలీసులు తెలిపారు. రాత్రి బిలాస్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేశామన్నారు. సోహ్నాలో హింసకు పాల్పడిన 15 మందిని ఆదివారం రాత్రి అరెస్టు చేసి కోర్టు జ్యుడీషియల్ కస్టడీకి పంపినట్లు గురుగ్రామ్ పోలీసులు తెలిపారు.

ముస్లిం మత పెద్ద హత్యపై సిట్ దర్యాప్తునకు డిమాండ్

ఇదిలా ఉండగా, సోమవారం గురుగ్రామ్‌లోని తిగ్రా గ్రామంలో జరిగిన 'మహాపంచాయత్' తర్వాత ఏర్పడిన కమిటీ గ్రామానికి చెందిన కొంతమంది యువకులను దాడి చేశారని పేర్కొంటూ, ముస్లిం మత గురువు హత్యపై 'న్యాయమైన దర్యాప్తు' కోసం సిట్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది. మసీదుపై దాడికి గల కారణాలపై విచారణ జరిపించాలని డిప్యూటీ కమిషనర్, పోలీసు కమిషనర్‌లకు పంపిన వినతిపత్రంలో కమిటీ కోరింది. గురుగ్రామ్‌లోని సెక్టార్ 57లోని అంజుమన్ మసీదుపై ఆగస్ట్ 1 తెల్లవారుజామున ఒక గుంపు దాడికి సంబంధించి కనీసం నలుగురు గ్రామస్తులను అరెస్టు చేశారు.

ధరలపై మహిళా సమాఖ్య వినూత్న నిరసన

విశాలాంధ్ర - పెందుర్తి: ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం ఉదయం విశాఖ జిల్లా పెందుర్తి రైతు బజారు వద్ద నిత్యావసర వస్తువుల ధరలు అదుపు చేయాలని డిమాండ్ చేస్తూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. పశువులు తినే ఆకులు నోటిలో పెట్టుకొని, దండలుగా వేసుకొని నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య వర్కింగ్ ప్రెసిడెంట్ అత్తిలి విమల మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో నిత్యావసర వస్తువుల ధరలు, వంట గ్యాస్, విద్యుత్ చార్జీలను సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండేలా చూస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే హామీలను గాలికి వదిలేసిందని విమర్శించారు. పంజాబ్ రాష్ట్రం తరహాలో ఏపీలో కూడా 500 రూపాయలకే వంట గ్యాస్ సిలిండర్లను ఇవ్వాలని కోరారు. ధరలను అదుపుచేసేందుకు అవసరమైన చర్యలను ప్రభుత్వం తక్షణమే తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు ఇదే తరహాలో కొనసాగితే రాష్ట్రంలో పేద ప్రజల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షులు ఎంఏ బేగం, వనజ, పెందుర్తి ఏరియా కార్యదర్శి అంపావల్లి అన్నపూర్ణ, అధ్యక్షులు ఎన్. అరుణ, కె.రజని, అనురాధ, దీవిన, పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

'ఫోర్జరీ'పై జగన్ స్పందించాలి

నాదెండ్ల మనోహర్ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ముఖ్యమంత్రికి తెలియకుండా... ఆయన ప్రమేయం లేకుండా 225 ఫైళ్లపై సీఎం డిజిటల్ సంతకాలు ఆయన పేషీలోనే ఫోర్జరీ అయ్యాయనే వార్తలపై సీఎం జగన్ తక్షణమే స్పందించాలని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ డిమాండ్ చేశారు. జనసేన కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియా సమావేశంలో సీఎంవోపై సంచలన ఆరోపణలు చేశారు. సీఎం పేషీలోకి వచ్చే ఫైళ్లు చాలా కీలకమని, అలాంటి ఫైళ్లపై సీఎంకే తెలియకుండా సంతకాలు ఫోర్జరీ చేయడమంటే దీనివెనుక ఏదో తతంగమే నడిచి ఉంటుందన్నారు. ఫోర్జరీ చేసిన ఫైళ్లు ఏమిటి? రెవెన్యూ శాఖకు సంబంధించినవా...గనులు శాఖవా? బదిలీలు, నియామకాలకు చెందినవా? ఇంకా ఇతర ముఖ్య ఫైళ్లు ఇందులో ఉన్నాయా అనేది అంతు పట్టకుండా ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

సీఎం పేషీలో ఇంత పెద్ద తప్పు జరిగినా విషయం బయటకు పొక్కకుండా ఎందుకు అంత రహస్యంగా ఉంచుతున్నారని నిలదీశారు. దీని వెనుక ఉన్న శక్తులు.. వ్యక్తులు ఎవరని ప్రశ్నించారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి కార్యాలయంలోని ఫైళ్లకే రక్షణ కరువైతే వలంటీర్లు సేకరిస్తున్న సామాన్యుడికి సంబంధించిన సమాచారానికి భద్రత ఎక్కడుంటుందని ప్రశ్నించారు. 360 డిగ్రీల సమాచారం సేకరణ పేరుతో ప్రజల వ్యక్తిగత అంశాలు, అత్యంత సున్నితమైన అంశాలను వలంటీర్లు తీసుకుం టున్నారన్నారు. ఆ సమాచారం ఎక్కడికి వెళుతోందన్నారు. హైదరా బాదులోని నానక్‌రామ్‌గూడ కార్యాలయంలో ఏం జరుగుతుందో ప్రభుత్వం ఇప్పటి వరకు సమాధానం ఎందుకు చెప్పలేదని అడిగారు.

టీటీడీ పాలక మండలి కీలక నిర్ణయాలు

వైవీ సుబ్బారెడ్డి

విశాలాంధ్ర - తిరుమల : తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ధర్మకర్తల మండలి అనేక కీలక నిర్ణయాలను తీసుకుంది. టీటీడీ ధర్మకర్తల మండలి చివరి సమావేశం సోమవారం తిరుమల అన్నమయ్య భవనంలో ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగింది. అధ్యక్షునిగా తాను పనిచేసిన నాలుగేళ్లలో ఎక్కువమంది సామాన్య భక్తులకు శ్రీ వేంకటేశ్వరుని దర్శనం కల్పించేందుకు ఎల్1, ఎల్2, ఎల్3 టికెట్లు రద్దు చేయడం, సామాన్యులకు స్వామివారి తొలి దర్శనం కల్పించేందుకు వీఐపీ బ్రేక్ సమయాన్ని మార్చుతూ తీసుకున్న నిర్ణయాలు అత్యంత సంతృప్తినిచ్చాయని సుబ్బారెడ్డి చెప్పారు. తిరుమల దర్శనానికి వచ్చే సామాన్య భక్తులకు వసతి, ఇతర సదుపాయాలు మెరుగుపరచడం కోసం అనేక నిర్ణయాలు తీసుకున్నామని, అయితే, ఈ రెండు నిర్ణయాలు మాత్రం ఎప్పటికీ మరువలేనివని తెలిపారు. నూతన ఛైర్మన్‌గా నియమితులైన భూమన కరుణాకర్‌రెడ్డి అనుభవం టీటీడీ అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా అధికారులు ఛైర్మన్ నాలుగేళ్ల పదవీకాలంలో తీసుకున్న ముఖ్యమైన నిర్ణయాలకు సంబంధించిన పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. అనంతరం వైవి.సుబ్బారెడ్డి మీడియాకు బోర్డు నిర్ణయాలను వెల్లడించారు. రూ.4 కోట్లతో అలిపిరి కాలిబాట మార్గంలోని మొదటి ఘాట్ రోడ్డులో మోకాలిమెట్టు నుంచి శ్రీ లక్ష్మీ నరసింహస్వామివారి ఆలయం వరకు మిగిలి ఉన్న ప్రదేశంలో ఫుట్‌పాత్ షెల్టర్ల నిర్మాణం, రూ.2.20 కోట్లతో తిరుమలలోని ఔటర్ రింగ్ రోడ్డులో విద్యుత్ బస్సుల కోసం ఛార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. రూ 2.50 కోట్లతో తిరుమలలోని పిఏసి-1లో అభివృద్ధి పనులు.రూ.24 కోట్లతో రెండు ఘాట్ రోడ్లలో రక్షణ గోడల నిర్మాణం.రూ.4.50 కోట్లతో శ్రీవారి ప్రసాదాలు, అన్నప్రసాదం తయారీకి వినియోగించే వంట సరుకులను మరింత నాణ్యంగా పరిశోధించేందుకు వీలుగా అత్యాధునిక యంత్ర పరికరాలు కొనుగోలు చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయం చెంత భక్తులు వేచి ఉండేందుకు తిరుమల వైకుంఠం క్యూ కాంప్లెక్స్ తరహాలో రూ.23.50 కోట్లతో యాత్రికుల వసతి భవనం నిర్మాణం.త్వరలో అందుబాటులోకి రానున్న శ్రీ పద్మావతి చిన్నపిల్లల సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రికి అవసరమైన స్పెషలిస్టు డాక్టర్లు, డ్యూటీ డాక్టర్లు, స్టాఫ్‌నర్సులు, ఇతర పారామెడికల్ సిబ్బంది నియామకానికి అనుమతి. అదేవిధంగా రూ.75.86 కోట్లతో అత్యాధునిక వైద్యపరికరాల కొనుగోలు చేయనున్నట్టు తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో శ్రీవాణి నిధులతో 26 ఆలయాల అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. మీడియా సమావేశంలో టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యులు, భూమన కరుణాకర్‌రెడ్డి, పోకల అశోక్‌కుమార్, బుర్రా మధుసూదన్ యాదవ్, మూరంశెట్టి రాములు, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డి, జెఈవో వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

సుబ్బారెడ్డి సేవలు బేష్: భూమన

టీటీడీ ఛైర్మన్‌గా వైవీసుబ్బారెడ్డి నాలుగేళ్ల పాటు అందించిన సేవలు అనుసరణీయమని టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యులు భూమన కరుణాకర్‌రెడ్డి కొనియాడారు. తిరుమల అన్నమయ్య భవనంలో సోమవారం జరిగిన ధర్మకర్తల మండలి సమావేశంలో ఈ మేరకు ఆయన తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా భూమన కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ వైవీ.సుబ్బారెడ్డి తన పదవీకాలంలో సామాన్య భక్తులకు మెరుగైన వసతులు కల్పించడానికి, దేవస్థానం అభివృద్ధికి ఎంతో కృషి చేశారని ప్రశంసించారు. సుబ్బారెడ్డి సేవలను కొనియాడారు. అనంతరం భూమన కరుణాకర్‌రెడ్డి శాలువతో వైవీ సుబ్బారెడ్డిని సన్మానించారు.

సేంద్రియ చేనేత ఉత్పత్తులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

చేనేత, జౌళి పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి సునీత

విజయవాడలో ఘనంగా జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-విజయవాడ: సేంద్రీయ పద్దతుల్లో తయారైన చేనేత వస్త్రాలకు విదేశాలలో మంచి ఆదరణ ఉందని, ఆ దిశగా రైతులు, చేనేత కార్మికుల్లో అవగాహన కలిగిస్తున్నామని రాష్ట్ర చేనేత, జౌళిశాఖ ముఖ్య కార్యదర్శి కె.సునీత తెలిపారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరిం చుకుని విజయవాడ మేరీస్ స్టెల్లా ఇండోర్ స్టేడియంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రదర్శనను ఆమె లాంఛనంగా ప్రారంభించారు. ఆర్గానిక్ హ్యాండ్‌లూమ్‌కు పెరుగుతున్న ప్రాచుర్యాన్ని పరిగణలోకి తీసుకుని ఈ ఏడాది 800 ఎకరాల్లో సేంద్రీయ పద్ధతిలో పత్తి సాగు చేసేందుకు రైతులను ప్రోత్సహించామన్నారు. చేనేత రంగంలో ఆర్గానిక్ వస్త్రాల తయారీ మరెంతో దూరంలో లేదని వివరించారు. జర్మనీ, పారిస్, జపాన్ తదితర దేశాల్లో భారతీయ చేనేతకు మంచి ఆదరణ లభిస్తోందని సునీత పేర్కొన్నారు. చేనేత,జౌళి శాఖ కమిషనర్ ఎంఎం నాయక్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేతకు ఎంతో మద్దతునిస్తున్నాయన్నారు. ఆప్కో ఛైర్మన్ గంజి చిరంజీవి మాట్లాడుతూ చేనేతల పక్షపాతిగా ముఖ్యమంత్రి జగన్ ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. ఏపీ ఫైబర్ గ్రిడ్ ఛైర్మన్ గౌతంరెడ్డి మాట్లాడుతూ చేనేత రంగానికి ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ముందడుగు వేయాలన్నారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టరు ఎస్.ఢిల్లీరావు మాట్లాడుతూ చేనేత వస్త్రాల వినియోగం పెరిగేందుకు ప్రతి ఒక్కరూ వారానికి ఒక్కసారైనా చేనేత వస్త్రాలను ధరించాలన్నారు. ఈ సందర్భంగా ముఖ్యకార్యదర్శి సునీత స్వయంగా రాట్నం వడికారు.

అదరహో అనిపించిన ఆప్కో చేనేత వస్త్రాల ఫ్యాషన్ షో: జాతీయ చేనేత దినోత్సవ వేడుకల నేపధ్యంలో ఆప్కో నూతనత్వానికి శ్రీకారం చుట్టింది. చేనేత వస్త్ర శ్రేణితో సరికొత్త వరవడితో విజయవాడలో పడతులు చేసిన ర్యాంప్ వాక్ అదరహో అనిపించింది. చేనేత సంస్కృతి సంప్రదాయాల మేలుకలయికగా చేనేత జౌళిశాఖ, ఆప్కో నిర్వహించిన జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు ఇంద్ర ధనస్సును మరిపింపచేసాయి . సరికొత్త డిజైన్లతో రూపొందించిన సాంప్రదాయ వస్త్రాలతో ప్రదర్శన నిర్వహించిన ముద్దుగుమ్మలు ఆహా అనిపించారు. చీరాల, ధర్మవరం, ఉప్పాడ, మంగళగిరి ఇలా ఒకటా రెండా వందలాది డిజైన్లతో ప్రత్యేకించి యువతను ఆకర్షించే విధంగా రూపుదిద్దిన ఆప్కో వస్త్రాల ప్యాషన్ షో కేక పుట్టించింది.

చేనేతలను నిర్వీర్యం చేస్తున్న జగన్

జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమంలో టీడీపీ నేతల ధ్వజం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : చారిత్రక నేపథ్యం కలిగిన చేనేతలు గత నాలుగేళ్లుగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో అత్యంత దుర్భరమైన పరిస్థితులు ఎదుర్కొంటున్నారని టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప ధ్వజమెత్తారు. తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో బీసీ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకట గురుమూర్తి అధ్యక్షతన సోమవారం జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన నిమ్మల కిష్టప్ప మాట్లాడుతూ.. పిరికివాడిగా వందేళ్లు బతికే కంటే.. తెగించిపోరాడి పదేళ్లు బతికినా చాలన్నారు. ప్రశ్నించే వారే ఉండకూడదనేలా జగన్ రెడ్డి ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఇలాంటి వారిని మనం ఎదిరించి మన హక్కులను రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. శాసనమండలి సభ్యులు పంచుమర్తి అనురాధ మాట్లాడుతూ.. చేనేతలకు గొడవ పడే మనస్తత్వం లేదని, అందుకే జగన్ రెడ్డి వారిపై దాడులకు ఉసిగొల్పు తున్నారన్నారు. మంగళగిరిలో చేనేత భవనం కూల్చారు.. టీడీపీ హయాంలో చేనేతల కోసం సబ్సిడీలు, ప్రోత్సాహకాలు, పరికరాలు అందించే పథకాలుంటే.. నేడు అన్నీ రద్దు చేసి అణచివేస్తూ అవమానాలకు గురి చేస్తున్నారన్నారు. చేనేత సమస్యలపై గళం విప్పి గర్జించాలన్నారు. బీసీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ బొడ్డు వేణుగోపాల్ రావు మాట్లాడుతూ.. చేనేతలు అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వ ప్రోత్సాహకాలు అవసరమన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం తర్వాత.. అతిపెద్ద మార్గం అయిన చేనేత రంగం ప్రస్తుతం తీవ్రమైన గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నేతన్న నేస్తం అని ప్రకటించి అన్నీ రద్దు చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. పోగుల్ని అల్లి బట్ట తయారు చేసినట్లు.. మన వర్గంలోని ప్రజలందరినీ ఏకం చేసి అభివృద్ధికి మార్గాలు వేసుకుందామని పిలుపునిచ్చారు. టీడీపీ బీసీ సెల్ ఉపాధ్యక్షులు కాండ్రు శ్రీనివాస్ రావు, మంగళగిరి సమన్వయకర్త నందం అబద్దయ్య, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీ దేవి, బీసీ ఫెడరేషన్ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ గంజాం రాఘవేంద్ర తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా చేనేత వృత్తిపై ఆధారపడిన 20 మంది చేనేత కళాకారుల్ని సన్మానించారు.

పెడనలో ఘనంగా చేనేత దినోత్సవం

విశాలాంధ్ర-పెడన : చేనేత సహకార సంఘాల రుణాలను రద్దుచేసి వెంటనే బకాయిలు ఇప్పించాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. జాతీయ చేనేత దినం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం (ఏఐటీయూసీ), ఆంధ్ర ప్రదేశ్ చేనేత కార్మిక సంఘం (సీఐటీయూ) అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సర్వోదయ చేనేత సహకార సొసైటీ ఆవరణలో బూసం. బాలసుబ్రమణ్యం చేనేత జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రదర్శనగా ప్లే కార్డులు చేతబట్టి రక్షించండి రక్షించండి చేనేతను, ఆదుకోవాలి చేనేత పరిశ్రమను అంటూ బస్టాండ్‌కు చేరుకొని మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు కట్టా హేమ సుందరరావు మాట్లాడుతూ, చేనేత సహకార సంఘాల ద్వారా కార్మికులకు గత ఆరు సంవత్సరాలుగా రావలసిన రిబేటు సబ్సిడీ, పావలా వడ్డీ రాక చేనేత సహకార సంఘాలు మూతపడే పరిస్థితికి చేరుకున్నాయన్నారు. వెంటనే ఆ బకాయిలు ఇప్పించి చేనేత పరిశ్రమను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ మాట్లాడుతూ మానవునికి నాగరికత నేర్పిన చేనేత పరిశ్రమ నేడు దీన స్థితిలో ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో పంచల నరసింహారావు, సజ్జా. మూర్తి రాజు, రావూరి భాస్కరరావు, బట్ట కోట సుబ్రహ్మణ్యం, యక్కల. పితాంబరధరరావు, ఊటుకూరు చినమల్లయలింగం, గోరురాజు, వాసా గంగాధర రావు, ఉట్ల. పేరయ్య లింగం తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ ప్రత్యేక ఆహ్వానితుల పిటిషన్ డిస్మిస్

నియామకాలపై విచారణ 11కు వాయిదా వేసిన హైకోర్టు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తిరుమల తిరుపతి బోర్డు సమావేశాలకు హాజరయ్యేందుకు అనుమతించాలని కోరుతూ కొందరు ప్రత్యేక ఆహ్వానితులు వేసిన పిటిషన్‌ను న్యాయస్థానం సోమవారం డిస్మిస్ చేసింది. అలాగే టీటీడీ బోర్డుకు ప్రత్యేక ఆహ్వానితుల నియామకాన్ని సవాలు చేస్తూ దాఖలయిన వ్యాజ్యాలపై హైకోర్టు సోమవారం విచారణ చేపట్టింది. ఈ నియామ కాలకు వీలు కల్పిస్తూ ఏపీ దేవాదాయ చట్టానికి రాష్ట్ర ప్రభుత్వం సవరణ చేస్తూ ఆర్డినెన్స్ తెచ్చిన సంగతి తెలిసిందే. బోర్డులో భారీగా ప్రత్యేక ఆహ్వానితులను నియమించటం నిబంధనలకు విరుద్ధమని పిటిషనర్ తరపు న్యాయవాది వై.బాలాజీ వాదనలు వినిపించారు. గతంలో ప్రత్యేక ఆహ్వానితుల నియామకంపై న్యాయస్థానం స్టే విధించిందని, దీంతో నియామకానికి చట్టబద్ధత కల్పించేందుకే దేవాదాయ శాఖ చట్టాన్ని సవరించారని కోర్టుకు విన్నవించారు. వాదనలు విన్న హైకోర్టు తదుపరి విచారణను ఈ నెల 11వ తేదీకి వాయిదా వేసింది.

రాజ్యసభలో ఢిల్లీ సేవల బిల్లు

ప్రవేశపెట్టిన హోం మంత్రి అమిత్ షా

ఇది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధం : కాంగ్రెస్

న్యూఢిల్లీ: ఢిల్లీ ప్రభుత్వంలోని సీనియర్ అధికారుల బదిలీలు, నియామకాల నిర్వహణ కోసం జారీ చేసిన ఆర్డినెన్స్ స్థానంలో ఢిల్లీ ప్రభుత్వ జాతీయ రాజధాని ప్రాంతం (సవరణ) బిల్లు-2023 ను హోం మంత్రి అమిత్ షా సోమవారం రాజ్యసభలో ప్రవేశపెట్టారు. రాజ్యసభ మధ్యాహ్న భోజనానికి ముందు సెషన్‌లో వాయిదాపడింది. తిరిగి మధ్యాహ్నం 2 గంటలకు సమావేశమైంది. ఈ బిల్లును గత వారం లోక్‌సభ ఆమోదించింది. ఢిల్లీ పోలీసు, శాంతిభద్రలు, భూమి మినహా సేవల నియంత్రణను ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఎన్నికయిన ప్రభుత్వానికి సుప్రీం కోర్టు అప్పగించిన వారం తర్వాత, మే 19న కేంద్ర ప్రభుత్వం ఈ ఆర్డినెన్స్‌ను విడుదల చేసింది. మే 19న జారీ చేసిన ఢిల్లీ ప్రభుత్వ జాతీయ రాజధాని ప్రాంతం (సవరణ) బిల్లు-2023 పై స్టే విధించాలని ఢిల్లీ ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయిం చింది. అయితే, ఢిల్లీలో సేవల నియంత్రణకు సంబంధించిన కేంద్రం ఆర్డినెన్స్‌పై మధ్యంతర స్టే ఇచ్చేందుకు గత నెలలో సుప్రీం కోర్టు నిరాకరిం చింది. ఇది ఢిల్లీ ప్రభుత్వ జాతీయ రాజధాని ప్రాంతం (సవరణ) బిల్లు-2023 ను రాజ్యాంగ ధర్మాసనానికి సూచించింది. కాగా, సభలో జరిగిన చర్చలో కాంగ్రెస్ సభ్యుడు అభిషేక్ మను సింఘ్వీ బిల్లును వ్యతిరేకిస్తూ, 'ఇది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధం' అని, 'తిరోగమన బిల్లు' అని అన్నారు. 'ఇది ఢిల్లీ ప్రజలపై ముందస్తు దాడి, సమాఖ్య విధానాన్ని ఉల్లంఘించడమే' అని కూడా తెలిపారు. మరోవైపు, బీజేపీకి చెందిన సుధాన్షు త్రివేది బిల్లును సమర్థించారు. సుప్రీం కోర్టు తీర్పు తర్వాత ఢిల్లీలోని ఆప్ ప్రభుత్వం 'పెద్ద ఎత్తున అధికారుల బదిలీలను' ఎలా చేపట్టిందో పరిశీలించేందుకు ఆరి ్డనెన్స్, తదనంతరం బిల్లు అవసరమని ఆయన అన్నారు. నేషనల్ క్యాపిటల్ సివిల్ సర్వీసెస్ అథారిటీలో ముఖ్యమంత్రి, ప్రధాన కార్యదర్శి, ఢిల్లీ ప్రిన్సిపల్ హోం సెక్రటరీ ఉంటారు. అధికారుల బదిలీలు, నియామకాలు, క్రమశిక్షణా వ్యవహారాలకు సంబంధించి ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్‌జీ) కి సిఫార్సులు చేయడానికి ఈ బిల్లు అథారిటీకి అధికారం ఇస్తుంది. నేషనల్ క్యాపిటల్ సివిల్ సర్వీసెస్ అథారిటీ సిఫార్సు చేసినవి, ఢిల్లీ శాసనసభ సమావేశ పరచడం, వాయిదా వేయడం, రద్దు చేయడం వంటి అనేక విషయాలపై తన స్వంత విచక్షణాధికారాన్ని వినియోగించుకోవడానికి కూడా ఈ బిల్లు ఎల్‌జీకి అధికారం ఇస్తుంది. ఇదిలా ఉండగా, ఢిల్లీ ప్రభుత్వంలోని ఉన్నతాధికారుల బదిలీలు, పోస్టింగులపై ఆర్డినెన్స్ స్థానంలో ఢిల్లీ సర్వీసెస్ బిల్లును విపక్ష పార్టీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఈనెల 3న విపక్ష పార్టీలు ఈ బిల్లును నిరసిస్తూ లోక్‌సభ నుంచి వాకౌట్ చేశాయి.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.